www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
☎ : 99484 33277 / 9014966169

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 200 | గురువారం | 16 జులై, 2026



# తరగతి గదుల్లోనే తెలంగాణ భవిష్యత్తు

## ఆ నమ్మకంతోనే విద్యాశాఖను నా వద్దే ఉంచుకున్నా

- ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం
- ఒక్కో విద్యార్థిపై ఏడాదికి సగటున రూ.1.08 లక్షల ఖర్చు చేస్తున్నాం
- గతంలో మౌలిక సదుపాయాల కొరత కారణంగానే విద్యార్థుల సంఖ్య తగ్గింది
- యువతకు ప్రపంచస్థాయి నైపుణ్యాలు అందించడంపై దృష్టి సారించాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజానావ, హైదరాబాద్

తెలంగాణ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందనే అచంచల విశ్వాసంతోనే విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను అన్నివిధాలా బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. వనపర్తి జిల్లాలో నూతనంగా నిర్మించిన బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని బుధవారం ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యను పటిష్టం చేయకుండా విద్యారంగ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించదని సీఎం పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి విద్యార్థికి నాణ్యమైన, సమాన విద్యా అవకాశాలు అందించాలంటే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ఒక్కటే మార్గమని చెప్పారు. ప్రభుత్వ బడులు బలపడితేనే రాష్ట్ర విద్యా ప్రమాణాలు మెరుగుపడి, భవిష్యత్ తరాలకు ఉజ్వల అవకాశాలు లభిస్తాయని అన్నారు. గత ప్రభుత్వ తరువాయి 2లో..

# పాలమూరులో అమరరాజా లిథియం సెల్ ప్లాంట్

### రూ.500 కోట్లతో నిర్మించిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్‌ను ప్రారంభం

### రూ.9,500 కోట్ల గిగా ఫ్యాక్టరీ ప్రాజెక్టులో కీలక మైలురాయి

- 'తెలంగాణ రైజింగ్–2047'తో రాష్ట్రాన్ని పారిశ్రామిక శక్తిగా తీర్చిదిద్దుతాం
- పాలమూరు–రంగారెడ్డి, దిండి ప్రాజెక్టులపై త్వరలో శుభవార్త : సీఎ రేవంత్

**ప్రజానావ, మహబూబ్‌నగర్:** తెలంగాణను అధునాతన పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా నిలబెట్టే మరో కీలక అడుగు పడింది. మహబూబ్‌నగర్ జిల్లాలో అమరరాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ ఏర్పాటు చేసిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. రూ.500 కోట్ల పెట్టుబడితో నిర్మించిన ఈ ప్లాంట్‌లో తొలి దశలో 60 మెగావాట్ గంటల (ఎంవీహెచ్) సామర్థ్యంతో లిథియం–అయాన్ సెల్ల ఉత్పత్తి చేపట్టనున్నారు. ఈ ప్లాంట్‌లో తయారయ్యే సిలిండ్రికల్, ప్రిజ్మాటిక్ నమూనాల లిథియం–అయాన్ సెల్‌లను వివిధ పరిశ్రమలకు చెందిన ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థలు (ఓఈఎంలు) వాణిజ్య ఉత్పత్తికి ముందు నాణ్యత పరీక్షలు నిర్వహించి ఆమోదించేందుకు వినియోగించనున్నట్లు సంస్థ వెల్లడించింది. ఆగస్టు 2026 నుంచి ఈ సెల్ల సరఫరా వినియోగదారులకు ప్రారంభమవుతుందని తెలిపింది. ఈ కస్టమర్ తరువాయి 2లో..






# మెట్రోలో అదనపు కోచ్‌లు

- ప్రయాణికుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి
- హెచ్ఎంఆర్ఎల్ ఏడీఎండీ అజిత్‌రెడ్డి
- భద్రత, లాస్ట్ మైల్ కనెక్టివిటీ, పార్కింగ్, స్కైవాక్‌ల విస్తరణపై అధికారులతో సమీక్ష
- కోచ్‌ల సమీకరణకు తయారీ సంస్థలతో చర్చలు ప్రారంభించాలని ఆదేశం
- ఆర్టీసీ, రవాణా శాఖతో సమన్వయం పెంచాలని సూచన
- హైటెక్‌సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో ప్రజా రవాణాపై ప్రత్యేక ప్రణాళిక

**ప్రజానావ, హైదరాబాద్:** హైదరాబాద్ మెట్రోలో ప్రయాణికులకు మరింత సురక్షితమైన, సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు వీలైనంత త్వరగా అదనపు కోచ్‌లను సమీకరించేందుకు తయారీ సంస్థలతో చర్చలు ప్రారంభించాలని హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మెట్రో ప్రస్తుత కారిడార్ల నిర్వహణ, అభివృద్ధిపై వివిధ విభాగాల సీనియర్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా హైదరాబాద్ మెట్రో అభివృద్ధికి కొత్త కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. మొదటి దశలో నిర్మించిన 69 కిలోమీటర్ల మెట్రో మార్గాల్లో ప్రయాణికుల సౌకర్యాలు, లాస్ట్ మైల్ కనెక్టివిటీ, భద్రతా చర్యలు, పార్కింగ్ సదుపాయాలు, స్టేషన్ల పరిశుభ్రత, రద్దీ నిర్వహణ వంటి అంశాలను అజిత్‌రెడ్డి సమీక్షించారు. ప్రయాణికులు మెట్రో స్టేషన్ల నుంచి తమ గమ్యస్థానాలకు సులభంగా చేరుకునేందుకు ప్రస్తుతం ఉన్న లాస్ట్ మైల్ వాహన సేవలను మరింత విస్తరించాలని సూచించారు. ఇందుకోసం ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెట్రో స్టేషన్లకు అనుసంధానంగా ఉన్న స్కైవాక్‌ల నిర్వహణ, విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని, రైల్వే స్టేషన్లు–మెట్రో స్టేషన్ల మధ్య అనుసంధాన మార్గాల అభివృద్ధికి రైల్వే అధికారులతో తరువాయి 2లో..

- నీట్ పేపర్ లీక్

# రూ.5లక్షల డీల్!




- సంచలన విషయాలు వెల్లడించిన సీబీఐ
- ప్రశ్నలు తెప్పిచేందుకు రూ.5 లక్షలు చెల్లించిన లాతూర్ కోచింగ్ సెంటర్ యజమాని
- 10రోజుల ముందే ఎన్‌టీఏ ప్రశ్నాపత్ర రూపకర్త నుంచి కెమిస్ట్రీ ప్రశ్నల సేకరణ

5

# బ్రిక్స్ కనెక్ట్‌కు గ్రీన్‌సిగ్నల్

- కార్మిక మంత్రుల సమావేశంలో ప్రగతిశీల ప్రకటనకు ఆమోదం
- హైదరాబాద్ వేదికగా సభ్య దేశాల ఏకగ్రీవ నిర్ణయం
- సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధి, మహిళల ఉపాధికి ప్రాధాన్యం
- సమ్మిళిత, స్థిరమైన ఉపాధి వ్యవస్థ నిర్మాణానికి కీలక అడుగు
- కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ

5




# సర్ గడువు పొడిగింపు



- ఆగస్టు 3 వరకు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణకు మరో అవకాశం
- కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం
- ఆగస్టు 10న ముసాయిదా ఓటరు జాబితా
- అక్టోబర్ 12న తుది జాబితా విడుదల

2

# సీతమ్మ సాగర్‌కు అనుమతులే లక్ష్యం

- న్యాయపరమైన చిక్కులు తొలిగేలా కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు
- ప్రాజెక్టు పెండింగ్ అంశాలపై ఉత్తమ్‌తో మంత్రి తుమ్మల భేటీ



# చివరివరకు వేచిచూడొద్దు

- ఎస్ఐఆర్ ప్రక్రియకు పౌరసత్వంతో సంబంధం ఉంది
- ఈ నెల 20లోపే ఫారాలు సమర్పించాలి
- ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ

2

# ఇరాన్‌పై ఏకధాటిగా దాడులు

- హర్మూజ్ జలసంధి, తీరప్రాంత సైనిక స్థావరాలే లక్ష్యం
- యూఎస్ సెంట్రల్ కమాండ్
- క్షిపణి, డ్రోన్ నిల్వలు, నౌకాదళ సామర్థ్యాల ధ్వంసం

**వాషింగ్టన్/టెహ్రాన్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులను అడ్డుకునే లక్ష్యంతో ఇరాన్‌పై ఏడు గంటలపాటు నిరంతర వైమానిక దాడులు నిర్వహించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించింది. మంగళవారం రాత్రి ప్రారంభమైన ఈ ఆపరేషన్‌లో హర్మూజ్ జలసంధి, ఇరాన్ తీరప్రాంతాలకు సమీపంలోని పలు సైనిక లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. ప్రస్తుతం ఈ విడత దాడులు ముగిసినట్లు తెలిపింది. సెంట్‌కామ్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులు చేసే ఇరాన్ సామర్థ్యాన్ని బలహీనపరిచే ఉద్దేశంతో అమెరికా యుద్ధ విమానాలు, డ్రోన్లు, యుద్ధ నౌకల నుంచి క్షిపణులు, ఇతర ఆయుధాలను ప్రయోగించాయి. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన క్షిపణి, డ్రోన్ నిల్వలు, నౌకాదళ సామర్థ్యాలు, తీరప్రాంత రక్షణ వ్యవస్థలను ప్రధాన లక్ష్యాలుగా చేసుకున్నట్లు పేర్కొంది. ఇరాన్ ఓడరేవులకు రాకపోకలు సాగించే వాణిజ్య నౌకలపై అమెరికా నౌకాదళం దిగ్బంధనాన్ని పునఃప్రారంభించిన రోజే ఈ దాడులు జరగడం గమనార్హం. గత వారం రోజుల్లోనే ఇరాన్ ఏడు వాణిజ్య నౌకలపై దాడులకు పాల్పడిందని, ఉద్దేశపూర్వకంగానే పౌర నౌకలను లక్ష్యంగా చేసుకుంటోందని అమెరికా సెంట్రల్ కమాండ్ ఆరోపించింది.

### ఇరాన్ క్రిప్టో ఆస్తులూ ఫ్రీజ్

ఇదిలా ఉండగా, ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచుతూ అమెరికా కొత్త ఆంక్షలను అమలు చేస్తోంది. ఇరాన్ సెంట్రల్ బ్యాంక్‌కు అనుబంధంగా ఉన్న పలు క్రిప్టోకరెన్సీ వాలెట్లను ఫ్రీజ్ చేసినట్లు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తెలిపారు. ఈ చర్యతో సుమారు 130 మిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ ఆస్తులు నిలిచిపోయినట్లు వెల్లడించారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఈ తాజా పరిణామాలు ప్రాంతీయ భద్రతతో పాటు అంతర్జాతీయ సముద్ర వాణిజ్యంపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### అన్ని దేశాలకు సమాన అవకాశాలు..

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్న వేళ ఇరాన్ మరోసారి అమెరికా, దాని తరువాయి 2లో..



# నేటి నుంచి ఆషాఢ బోనాలు

- ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేసిన ప్రభుత్వం
- గ్రేటర్ పరిధిలో 3వేలకుపైగా ఆలయాల్లో నిర్వహణ
- ప్రజలకు మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు

2





గురువారం నుంచి ఆషాడ మాస బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావుతో పాటు ఆలయ ఈవో, పూజారులు, ధర్మకర్తల మండలి సభ్యులు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. జగదాంబ మహంకాళి దేవాలయంలో బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని ఈ సందర్భంగా ఆహ్వానం అందించారు.

# నేటి నుంచి ఆషాఢ బోనాలు

- ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేసిన ప్రభుత్వం
- గ్రేటర్ పరిధిలో 3వేలకుపైగా ఆలయాల్లోనిర్వహణ
- ప్రజలకు మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు





**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల ఉత్సవాలు రాష్ట్ర ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెప్పే శక్తి ఆరాధన పండుగ అని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆషాఢ బోనాల ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆమె హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల జీవన విధానం, సామాజిక ఐక్యత, సాంస్కృతిక వైభవానికి బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఇది కేవలం ఒక పండుగ మాత్రమే కాకుండా, తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహత్తర సాంస్కృతిక ఉత్సవమని అన్నారు. జులై 16 నుంచి ప్రారంభమయ్యే బోనాల ఉత్సవాల నిర్వహణకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మంత్రి వెల్లడించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లోని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న సుమారు మూడు వేలకుపైగా దేవాలయాల్లో బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## గంగా–జమున తహజీబ్‌కు ప్రతీకగా..

హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలు తెలంగాణ గంగా–జమున తహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తాయని, రాష్ట్ర లౌకిక స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయని మంత్రి పేర్కొన్నారు. గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పణతో ఉత్సవాలు ప్రారంభమై, ఆగస్టు 13న హరిబౌలిలోని అక్కన్న–మాదన్న మహంకాళి దేవాలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించిన అనంతరం ఘటాల నిమజ్జనంతో ముగుస్తాయని వివరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు బోనాల ఉత్సవాల్లో పాల్గొంటారని పేర్కొన్న మంత్రి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. భద్రత, పారిశుద్ధ్యం, ట్రాఫిక్, విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు తదితర అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఈ ఏడాది బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం రూ.20 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి మంత్రి కొండా సురేఖ కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, రైతులు సుభిక్షంగా ఉండాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. భక్తులందరూ ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకుని, బోనాలు సమర్పించి క్షేమంగా తమ ఇళ్లకు చేరుకునేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మంత్రి స్పష్టం చేశారు.

## తరగతి గదుల్లోనే తెలంగాణ భవిష్యత్తు

(మొదటిపేజీ తరువాయి)

హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడం వల్లే విద్యార్థుల చేరికలు గణనీయంగా తగ్గాయని రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పాఠశాల విద్యకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యారంగాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమైందని ఆరోపించారు.

### విద్యారంగంలో 18వ స్థానం

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధా న్యం ఇస్తోందని సీఎం తెలిపారు. ఒక్కో విద్యార్థిపై ఏడాదికి సగటున రూ.1.08 లక్షలు వ్యయం చేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం విద్యారంగం లో తెలంగాణ దేశవ్యాప్తంగా 18వ స్థానంలో ఉంద ని, రాష్ట్రాన్ని అగ్రస్థానాలకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఆవిష్కృ తమవుతుందనే నమ్మకంతోనే విద్యాశాఖను ఇతర మంత్రులకు కేటాయించకుండా తన వద్దే ఉంచుకు న్నట్లు సీఎం వెల్లడించారు. విద్యా వ్యవస్థలో సమగ్ర మార్పులు తీసుకురావడం ద్వారా ప్రభుత్వ పాఠశా లలను ప్రజల తొలి ఎంపికగా నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ లక్ష్యంతో రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాల జీ సెంటర్లుగా (ఏటీసీలు) అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. దీనివల్ల తెలంగాణ యువతకు జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో బ్లూ–కాలర్ ఉద్యోగ అవకాశాలు మరింతగా పెరు గుతున్నాయని, నైపుణ్యాభివృద్ధి ద్వారా అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే సామర్థ్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు.

# నీట్ పేపర్ లీక్.. రూ.5 లక్షల డీల్!



**న్యూఢిల్లీ:** నీట్–యూజీ 2026 ప్రశ్నాపత్రం లీక్ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ప్రత్యేక కోర్టు ముందు సంచలన విషయాలను వెల్లడించింది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు శివరాజ్ రఘునాథ్ మోటేగావ్‌కర్ జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ప్రశ్నాపత్రాల రూపకల్పన కమిటీలో సభ్యుడిగా ఉన్న పి.వి. కులకర్ణి నుంచి కెమిస్ట్రీ ప్రశ్నలను ముందుగానే పొందేందుకు రూ.5 లక్షలు చెల్లించినట్లు ఆరోపించింది. దర్యాప్తు ప్రకారం, మోటేగావ్‌కర్ కుమారుడు కులకర్ణి నిర్వహించే కోచింగ్ తరగతులకు హాజరవుతూ ఉండేవాడని, అదే మార్గం ద్వారా పరీక్ష ప్రశ్నలు బయటకు వచ్చినట్లు సీబీఐ పేర్కొంది. సహ నిందితులతో కలిసి పరీక్షకు ముందే లీకైన ప్రశ్నలను సేకరించినట్లు కోర్టుకు సమర్పించిన నివేదికలో వెల్లడించింది. సీబీఐ స్వాధీనం చేసుకున్న మోటేగావ్‌కర్ మొబైల్ ఫోన్‌లో మొత్తం 36 ఫొటోలు లభించగా, వాటిలో ఐదు డూప్లికేట్ చిత్రాలు ఉన్నట్లు తెలిపింది. మిగిలిన ఫొటోల్లో మొత్తం 132 చేతిరాత కెమిస్ట్రీ ప్రశ్నలు గుర్తించినట్లు పేర్కొంది. వాటిలో 111 ప్రశ్నలు ఎన్‌టీఏ రూపొందించిన నీట్–యూజీ 2026 మాస్టర్ ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలతో పూర్తిగా సరిపోలినట్లు దర్యాప్తులో తేలిందని కోర్టుకు వివరించింది. మొబైల్ ఫోన్ మెటాడేటా విశ్లేషణలో ఈ ప్రశ్నల ఫొటోలు నీట్ పరీక్షకు దాదాపు పది రోజుల ముందే తీసినట్లు గుర్తించినట్లు సీబీఐ తెలిపింది. మే 3న పరీక్ష నిర్వహించగా, అంతకు ముందే ఈ చిత్రాలు మొబైల్‌లో నమోదైనట్లు వెల్లడించింది. అలాగే ఆ చేతిరాత ప్రశ్నలు మోటేగావ్‌కర్‌వేనని ప్రాథమికంగా నిర్ధారించినట్లు పేర్కొంది. లీకైన ప్రశ్నల కోసం చెల్లించినట్లు ఆరోపిస్తున్న రూ.5 లక్షల నగదును సహ నిందితుడు మనోజ్ భగవాన్‌రావ్ షిరురే ఇచ్చిన సమాచారంతో స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ కోర్టుకు తెలిపింది. ఈ కేసులో ఇప్పటివరకు 13 మందిని అరెస్టు చేసినట్లు, వారంతా ప్రస్తుతం న్యాయపరమైన కస్టడీలో ఉన్నట్లు వెల్లడించింది. కాగా, మే 3న నిర్వహించిన నీట్–యూజీ 2026 పరీక్షపై ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలు రావడంతో జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) మే 12న పరీక్షను రద్దు చేసింది. అనంతరం జూన్ 21న దేశవ్యాప్తంగా మళ్లీ రీ–ఎగ్జామ్‌ను నిర్వహించింది.

# సీతమ్మ సాగర్‌కు అనుమతులే లక్ష్యం

- న్యాయపరమైన చిక్కులు తొలిగేలా కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు
- ప్రాజెక్టు పెండింగ్ అంశాలపై ఉత్తమ్‌తో మంత్రి తుమ్మల భేటీ
- అనుమతులు రాగానే పనులు వేగవంతం
- ఖమ్మం, భద్రాద్రి రైతులకు త్వరగా సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజానావ, హైదరాబాద్:** ప్రతిష్ఠాత్మక సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు వీలైనంత త్వరగా లభించేలా కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సచివాలయంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశమైన ఆయన సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. పర్యావరణ, అటవీ, వాతావ రణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంఓఈఎఫ్‌సీసీ) ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్‌వోపీ)కు సంబంధించిన అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉండడంతో 2023 మార్చి నుంచి సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని గుర్తు చేశారు. న్యాయపరమైన చిక్కులు త్వరగా తొలగి పర్యావరణ అనుమతులు లభించేలా ప్రభుత్వం అన్ని స్థాయిల్లో కృషి చేస్తోందన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రు లు, సంబంధిత శాఖలు, అధికారులతో సమన్వయం కొనసాగిస్తామని చెప్పారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులను పునఃప్రారంభించి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రెండు జిల్లాల రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

## మెట్రోలో అదనపు కోచ్‌లు

(మొదటిపేజీ తరువాయి)

సమన్వయం చేయాలని సూచించారు.

### ప్రతి స్టేషన్‌కు ప్రత్యేక కార్యాచరణ

ప్రతి మెట్రో స్టేషన్‌కు స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, ముందుగా కొన్ని స్టేషన్లలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసి, అనంతరం ఇతర స్టేషన్లకు విస్తరించాలని అజిత్‌రెడ్డి పేర్కొన్నారు. త్వరలో తానే స్వయంగా మెట్రో స్టేషన్లను సందర్శించి నిర్వహణ, సేవలను పరిశీలిస్తానని వెల్లడించారు. హైటెక్‌సిటీ, రాయదుర్గం, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కొండాపూర్ వంటి అధిక రద్దీ ప్రాంతాల్లో ప్రజారవాణా వ్యవస్థ అభివృద్ధికి సంబంధించి రూపొందించిన ప్రతిపాదనల పురోగతిని కూడా సమీక్షించారు. అలాగే ప్రయాణికుల భద్రత కోసం మెట్రో రైలు భద్రతా విభాగం అమలు చేస్తున్న చర్యలపై చర్చించారు.

# సర్ గడువు పొడిగింపు

- ఆగస్టు 3 వరకు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణకు మరో అవకాశం
- కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం
- ఆగస్టు 10న ముసాయిదా ఓటరు జాబితా
- అక్టోబర్ 12న తుది జాబితా విడుదల

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్–స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం గడువును పొడిగించింది. ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణకు ఈ నెల 24తో ముగియాల్సిన గడువును ఆగస్టు 3 వరకు పొడిగిస్తూ కొత్త షెడ్యూల్‌ను విడుదల చేసింది. అలాగే అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణకు సెప్టెంబర్ 9 వరకు అవకాశం కల్పించగా, తుది ఓటరు జాబితాను అక్టోబర్ 12న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ మందగించింది. గడువు ముగింపు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, వివిధ సంస్థల ప్రతినిధులు గడువు పొడిగించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ విజ్ఞప్తులను పరిశీలించిన ఎన్నికల సంఘం తాజా నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 1ను అర్హత తేదీగా పరిగణిస్తూ ఓటరు వివరాల సవరణ చేపట్టనున్నారు. ఇప్పటికే జూన్ 25 నుంచి ప్రారంభమైన బూత్ స్థాయి అధికారుల (బీఎల్‌వోలు) ఇంటింటి సర్వే, ఎన్యూమరేషన్ ప్రక్రియ ఆగస్టు 3 వరకు కొనసాగుతుంది. పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ పనులను కూడా అదే తేదీలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

### సెప్టెంబర్ 9వరకు అభ్యంతరాలు

ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్తంగా ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. అనంతరం కొత్త ఓటరు నమోదుతో పాటు పేరు, చిరునామా, ఇతర వివరాల మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులు, అభ్యంతరాలను ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు స్వీకరించనున్నారు. ప్రజల నుంచి అందే క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై నోటీసుల జారీ, విచారణ, పరిష్కార ప్రక్రియను ఆగస్టు 10 నుంచి అక్టోబర్ 8 వరకు పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. అనంతరం అన్ని సవరణలను చేర్చి తుది ఓటరు జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా ప్రకటించనుంది. దీంతో ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం లభించినట్లయింది.

# చివరి వరకు వేచి చూడొద్దు

- ఎస్ఐఆర్ ప్రక్రియకు పౌరసత్వంతో సంబంధం ఉంది
- ఈ నెల 20లోపే ఫారాలు సమర్పించాలి
- ఓటర్లకు సాయంగా ప్రత్యేక యాప్‌ను రూపొందించాం
- వర్షాల కోసం 26న రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు
- ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ



**ప్రజానావ, హైదరాబాద్:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలను చివరి తేదీ వరకు వేచి చూడకుండా ఈ నెల 20లోపే సమర్పించాలని ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు పౌరసత్వంతో సంబంధం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన సభలో మాట్లాడిన ఆయన, ఫారాల సమర్పణ విషయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఎన్యుమరేషన్ ఫారాలను సులభంగా నింపేందుకు హైదరాబాద్‌కు చెందిన ముస్లిం యువత సహకారంతో ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించినట్లు ఒవైసీ తెలిపారు. పార్టీ కార్యకర్తల ద్వారా అవసరమైన సహాయాన్ని అందిస్తూ, ఫారాల సమర్పణ ప్రక్రియను సులభతరం చేస్తున్నామని చెప్పారు. ఎస్ఐఆర్ ఫారాల సమర్పణకు ఈ నెల 24 చివరి తేదీగా నిర్ణయించినప్పటికీ, ఆలోపే ఫారాలను సమర్పించాలని ఆయన సూచించారు. చివరిరోజుల్లో పెద్దఎత్తున ఫారాలను ఎన్నికల సంఘం పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి రావడంతో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) తీవ్ర పనిభారాన్ని ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ముందుగానే ఫారాలు సమర్పిస్తే ప్రక్రియ సాఫీగా పూర్తవుతుందన్నారు. రాష్ట్రంలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే జూన్ 25న ప్రారంభమై జూలై 24 వరకు కొనసాగుతోందని గుర్తు చేశారు. ప్రతి అర్హ ఓటరు తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకుని, ఓటరు జాబితాలో తమ పేరు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### రాడికలైజేషన్ ఎలా అవుతుంది?

ఈ సందర్భంగా రాడికలైజేషన్‌పై కూడా ఒవైసీ స్పందించారు. మతాన్ని అనుసరించడం రాడికలైజేషన్ ఎలా అవుతుందని ప్రశ్నించిన ఆయన, గుంపుల దాడులు (మాబ్ లించింగ్‌లు), రైళ్లలో గడ్డం ఉన్న వ్యక్తులపై జరిగే దాడులు వంటి ఘటనలే అసలు రాడికలైజేషన్‌కు నిదర్శనమని వ్యాఖ్యానించారు. అలాంటి సంఘటనలను ప్రభుత్వాలు తగినంతగా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ముస్లింలు మతం పేరుతో రాడికలైజ్ కావడం లేదని కూడా పేర్కొన్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవని నేపథ్యంలో జూలై 26న రాష్ట్రవ్యాప్తంగా వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు ఒవైసీ ప్రకటించారు.

# ఇరాన్‌పై ఏకధాటిగా దాడులు

(మొదటిపేజీ తరువాయి)

మిత్రదేశాలకు ఘాటు హెచ్చరికలు జారీ చేసింది. పశ్చిమాసియా నుంచి చమురు, సహజవాయువు ఎగుమతులు కొనసాగాలంటే అన్ని దేశాలకు సమాన అవకాశాలు ఉండాలని, లేకపోతే ఎవరూ ఎగుమతులు చేయకుండా అడ్డుకుంటామని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో నౌకాదళ స్థావరంపై దాడులు చేపట్టిన అనంతరం ఐఆర్‌జీసీ ఈ ప్రకటన విడుదల చేసింది. తమపై ఒత్తిడి కొనసాగిస్తే అమెరికా మిత్రదేశాల చమురు, గ్యాస్ ఎగుమతి మార్గాలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. అవసరమైతే పశ్చిమాసియా నుంచి ప్రపంచానికి జరిగే చమురు, గ్యాస్ సరఫరాను పూర్తిగా నిలిపివేసే చర్యలకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేసింది. హార్మూజ్ జలసంధిపై నియంత్రణ సాధించినట్లు అమెరికా ప్రకటిస్తూనే, హిందూ మహాసముద్రంలో నౌకల రాకపోకలకు ఆటంకం కలిగించే చర్యలు చేపట్టిందని ఐఆర్‌జీసీ ఆరోపించింది. సముద్ర మార్గాలను దిగ్బంధించడం ద్వారా చమురు, గ్యాస్ సరఫరాను ప్రపంచానికి చేరకుండా చేస్తోందని విమర్శించింది. ఈ చర్యలు ప్రాంతీయ దేశాల ఆర్థిక ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని పేర్కొంది. పశ్చిమాసియాలో వాణిజ్యం ఒకే దేశం లేదా కూటమి ఆధిపత్యంలో కొనసాగదని, చమురు, గ్యాస్ ఎగుమతుల విషయంలో అన్ని దేశాలకు సమాన హక్కులు ఉండాలని ఐఆర్‌జీసీ స్పష్టం చేసింది. లేదంటే ప్రాంతీయ ఇంధన సరఫరా వ్యవస్థనే లక్ష్యంగా చేసుకునే చర్యలు తీసుకుంటామని మరోసారి హెచ్చరించింది. ఇదిలాఉంటే ఓ వైపు అమెరికా–ఇరాన్‌లు పరస్పర దాడులు చేసుకుంటుంటే.. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. ఈ దాడుల్లో గాజాలోని ఓ కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియా వెల్లడించింది.

### అప్పటివరకు హార్మూజ్ క్లోజ్: ఇరాన్

గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు కొనసాగిస్తోంది. అమెరికా దురాగతాలు ముగిసే వరకూ హార్మూజ్ జలసంధి మూసే ఉంటుందని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. ఇరాన్ దిగ్బంధనాన్ని ఉల్లంఘించి.. అమెరికాకు సహకారం అందించేందుకు ఏ నౌక కూడా సాహసించలేదు. అందుకే తాజాగా మేం ఎలాంటి దాడులు చేయలేదు అని ప్రకటించింది. ఈ ఘర్షణ ఇలాగే కొనసాగితే.. అమెరికా, దాని మిత్రదేశాలకు చెందిన ఇంధన నౌకలు వెళ్లే మార్గాలను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది.

# పాలమూరులో అమరరాజా లిథియం సెల్ ప్లాంట్

(మొదటిపేజీ తరువాయి)

క్వాలిఫికేషన్ ప్లాంట్ అమరరాజా చేపట్టిన రూ.9,500 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 16 గిగావాట్ గంటల (జీడబ్ల్యూహెచ్) సామర్థ్య గిగాఫ్యాక్టరీ ప్రాజెక్టులో కీలక భాగంగా నిలుస్తోంది. ఇప్పటికే ప్రారంభమైన 'ఈ–పాజిటివ్ ఎనర్జీ ల్యాబ్స్' పరిశోధనా కేంద్రంతో పాటు త్వరలో ప్రారంభం కానున్న 'గిగా–1' తయారీ యూనిట్‌తో కలిసి తెలంగాణలో సంస్థ తొలి విడత పెట్టుబడులు కీలక దశకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అమరరాజా సహ వ్యవస్థాపకుడు, చైర్మన్ జయదేవ్ గల్లా మాట్లాడుతూ.. ప్రపంచ ఇంధన రంగం వేగంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అధునాతన బ్యాటరీ సాంకేతికత అభివృద్ధి, పరీక్షలు, తయారీలో భారత్ కీలక పాత్ర పోషించే సమయం ఆసన్నమైందన్నారు. ఈ ప్లాంట్ ప్రపంచ స్థాయి ఇంధన పర్యావరణ వ్యవస్థ నిర్మాణానికి బలమైన పునాది వేస్తుందని చెప్పారు.

### నిజమైన గ్లోకల్ సంస్థ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, అమరరాజా స్థానిక ప్రతిభను ప్రపంచ సాంకేతికతతో మేళవించిన నిజమైన 'గ్లోకల్' సంస్థగా నిలిచిందని ప్రశంసించారు. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా వంటి దేశాల నుంచి స్ఫూర్తి పొందుతూ, ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో చైనాతో పోటీపడే స్థాయికి ఎదుగుతున్న సంస్థకు అభినందనలు తెలిపారు. 'తెలంగాణ రైజింగ్–2047' లక్ష్యంతో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్ర పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు అత్యాధునిక మౌలిక వసతులు కల్పిస్తున్నామని, పరిశ్రమలు, పర్యాటకం, ఆరోగ్యం తదితర రంగాల్లో కొత్త విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వాల కాలంలో అమలైన మంచి విధానాలను కొనసాగిస్తూ, విధానాల్లో స్థబ్దతకు తావులేకుండా పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నామని వివరించారు.

### పాలమూరు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

పాలమూరు ప్రాంత అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. నీటి పారుదల అంశాలపై పొరుగు రాష్ట్రాలతో చర్చలు కొనసాగుతున్నాయని, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీలు, డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటి కేటాయింపు కోసం ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయని వెల్లడించారు. ఈ అంశంలో మహబూబ్‌నగర్ ప్రజలకు త్వరలోనే శుభవార్త అందిస్తామని సీఎం ప్రకటించారు.

# 'బ్రిక్స్ కనెక్ట్'కు గ్రీన్‌సిగ్నల్

**ప్రజానావ, హైదరాబాద్:** హైదరాబాద్ వేదికగా జరుగుతున్న 12వ బ్రిక్స్ కార్మిక, ఉపాధి మంత్రుల సమావేశంలో భారత్ ప్రతిపాదించిన 'బ్రిక్స్ కనెక్ట్' కార్యక్రమానికి సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. ఇదే సమావేశంలో సమ్మిళిత, స్థిరమైన, ప్రజాకేంద్రిత ఉపాధి వ్యవస్థ నిర్మాణానికి మార్గదర్శకంగా నిలిచే ప్రగతిశీల ప్రకటన (ప్రోగ్రెసివ్ డిక్లరేషన్)ను కూడా సభ్య దేశాలు ఆమోదించాయి. ఈ నిర్ణయాలు బ్రిక్స్ దేశాల మధ్య కార్మిక రంగ సహకారాన్ని మరింత బలోపేతం చేస్తాయని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ పేర్కొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మాండవీయ మాట్లాడుతూ, భారత్ ప్రతిపాదించిన 'బ్రిక్స్ కనెక్ట్' కార్యక్రమానికి సభ్య దేశాలు ఏకాభిప్రాయం వ్యక్తం చేయడం సంతోషకరమైన పరిణామమన్నారు. ఈ వేదిక ద్వారా సభ్య దేశాల మధ్య విజ్ఞాన మార్పిడి, ఉత్తమ విధానాల పంచుకోవడం, సాంకేతిక పరిజ్ఞాన వినిమయం, పరస్పర సహకారం మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్మిక రంగంలో వినూత్న ఆలోచనలకు, ఉమ్మడి కార్యాచరణకు ఇది కీలక వేదికగా నిలుస్తుందని చెప్పారు. బ్రిక్స్‌కు అధ్యక్ష దేశంగా భారత్ ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదించిన 'హ్యూమానిటీ ఫస్ట్' దృక్పథానికి అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించిందని మాండవీయ వివరించారు. సామాజిక భద్రతను విస్తరించడం, మహిళల ఉపాధి భాగస్వామ్యాన్ని పెంచడం, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం, డిజిటల్ సాంకేతికతను వినియోగించి కార్మిక సంక్షేమాన్ని మెరుగుపరచడం వంటి అంశాలను ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు తెలిపారు.

### కార్మిక సంక్షేమంపై విస్తృత చర్చలు

జులై 15, 16 తేదీల్లో రెండు రోజుల పాటు జరుగుతున్న ఈ సమావేశంలో బ్రిక్స్ సభ్య దేశాల కార్మిక మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొంటున్నారు. 'బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టైనబిలిటీ' అనే ప్రధాన ఇతివృత్తంతో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో భవిష్యత్ ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రత, సుస్థిర అభివృద్ధి, కార్మిక సంక్షేమానికి సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. హైదరాబాద్ సమావేశంలో ఆమోదించిన ప్రగతిశీల ప్రకటనతో బ్రిక్స్ దేశాల మధ్య కార్మిక, ఉపాధి రంగాల్లో సమన్వయం మరింత బలోపేతం కావడంతో పాటు సమ్మిళిత అభివృద్ధి, సుస్థిర ఉపాధి కల్పనకు కొత్త దిశ ఏర్పడుతుందని మాండవీయ అభిప్రాయపడ్డారు.

# ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- 19న పోలీస్ యువశక్తి ఉచిత శిక్షణ ఎంపిక ప్రక్రియ
- పెద్దపల్లి జిల్లా అభ్యర్థులకు మాత్రమే అవకాశం




ప్రజానావ, పెద్దపల్లి : ఎస్ఐ, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న ఎస్ఐ, కానిస్టే బుల్ నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న పెద్దపల్లి జిల్లా యువతకు నిర్వహించనున్న పోలీస్ యువశక్తి ఉచిత శిక్షణ ఎంపిక కార్యక్రమం పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడు తూ పోలీస్ ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్న పెద్దపల్లి జిల్లా యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. అర్హులైన అభ్యర్థులకు నాణ్యమైన ఉచిత శిక్షణ అందించడం ద్వారా రాష్ట్ర పోలీస్ నియామకాల్లో జిల్లా నుంచి అధిక సంఖ్యలో అభ్యర్థులు విజయాలు సాధించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలి పారు. ఉచిత శిక్షణ కోసం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ను జూలై 19 (ఆదివారం) ఉదయం 6 గంటలకు గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (సీఈఆర్ క్లబ్)లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముందుగా ఫిజికల్ టెస్ట్, అనంతరం రాత పరీక్ష నిర్వహించి అర్హులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. పురుష అభ్యర్థులకు 1,600 మీటర్ల పరుగు, మహిళా అభ్యర్థులకు 800 మీటర్ల పరుగు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఉచిత కోచింగ్, స్టడీ మెటీరియల్, ఫిజికల్ ట్రైనింగ్ తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశం పెద్దపల్లి జిల్లా అభ్యర్థుల కు మాత్రమే అందుబాటులో ఉంటుం దని, ఆసక్తి గల అభ్యర్థులు జూలై 17, 2026లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. మరిన్ని వివరాలకు 83330 44460, 99497 25997, 81068 07784, 95736 88952 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రవీణ్ రెడ్డి,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం

- గురుకుల సీట్ల టాయింపులో నిర్లక్ష్యానికి తావు లేదు
- తల్లిదండ్రులకు సరైన మార్గదర్శనం చేయాలి
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ప్రజానావ, హైదరాబాద్ : పేద, దళిత, గిరిజన విద్యార్థుల విద్యాభవిష్యత్తును తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ఒక్క విద్యార్థి డా గురుకుల విద్యకు దూరం కాకుండా అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో, ఆ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు మరింత మానవీయ దృక్పథంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని డీఎస్సీ భవన్‌లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తమ పిల్లలకు గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలని వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల నుంచి మంత్రి స్వయంగా వినతిపత్రాలు స్వీకరించారు. ఒక్కొక్కరి సమస్యను ఓపికగా వింటూ వారి కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు, పిల్లల చదువుపై ఉన్న ఆశయాలను అడిగి తెలుసుకున్నారు. దూర ప్రాంతాలు, మారుమూల గ్రామాల నుంచి వచ్చిన పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలకు సవూప జిల్లాల్లో సీట్లు టాయించాలని, ఇతర జిల్లాల్లో చదివించడం వల్ల రవాణా, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రికి వివరించారు. వారి సమస్యలను విన్న మంత్రి స్పందిస్తూ, పేద కుటుంబాలకు చెందిన అర్హులైన విద్యార్థులకు సాధ్యమైనంత మేరకు వారికి అనులమైన జిల్లాల్లో సీట్లు టాయించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సందర్భంగా తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జాయింట్ సెక్రటరీ శ్రీ సక్రు నాయక్కు మంత్రి పలు కీలక సూచనలు చేశారు. సీట్ల టాయింపు పక్రియలో పారదర్శకత, మానవీయ దృక్పథం, విద్యార్థుల సంక్షేమం ప్రధాన ప్రమాణాలుగా ఉండాలని, ప్రతి అర్జీని నిబంధనల పరిధిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి విద్యార్థికి న్యాయం చేయాలని ఆదేశించారు. అలాగే మారుమూల గ్రామాలు, దూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వచ్చే తల్లిదండ్రు లు, సంరక్షకులు, బంధువులతో అధికారులు, సిబ్బంది అత్యంత మర్యాదపూర్వకంగా వ్యవహరించా లని మంత్రి సూచించారు. వారికి స్పష్టమైన సమాచారం అందిస్తూ, అవసరమైన మార్గదర్శకత్వం ఇవ్వాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురి చేయరాదని ఆదేశించారు.

# మాదాపూర్‌లో దారుణ హత్య

- యువకుడిని కత్తులతో పొడిచి చంపిన ఇద్దరు
- ప్రేమ పేరుతో వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఘటన
- దాడి అనంతరం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితులు




ప్రజానావ, హైదరాబాద్: హైదరాబాద్‌లోని మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో బుధవారం దారుణ హత్య చోటుచేసుకుంది. రామేశ్వరం కేఫ్ ఎదుట భాస్కర్ (30) అనే యువకుడిపై ఇద్దరు వ్యక్తులు కర్రలు, కత్తులతో దాడి చేయగా, తీవ్ర గాయాలతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన అనంతరం నిందితులు స్వయంగా మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. పోలీసులు తెలిపి న వివరాల ప్రకారం, వరంగల్ జిల్లా ఉప్పరపల్లికి చెందిన భాస్కర్ మాదాపూర్‌లోని శ్రీ సినోమా హోటల్‌లో కుక్‌గా పనిచేస్తున్నాడు. వరంగల్‌కు చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లను ప్రేమ పేరుతో కొంతకా లంగా వెంబడిస్తూ, ఫోన్ ద్వారా వేధిస్తున్నాడని వారు వరంగల్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో పోలీసులు భాస్కర్‌కు కౌన్సెలింగ్ నిర్వహించినప్పటికీ వేధింపులు కొనసాగుతున్నా యని యువతులు తమ తండ్రి రాజుకు తెలిపారు. దీంతో రాజు భాస్కర్‌కు ఫోన్ చేయగా, దమ్ముంటే హైదరాబాద్‌కు రండి.. చూసు కుందాం అంటూ సవాల్ విసిరినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. అనంతరం రాజు తన బావమరిది కుమారస్వామితో కలిసి హైదరా బాద్‌కు వచ్చి, రామేశ్వరం కేఫ్ ఎదుట భాస్కర్‌పై కర్రలు, కత్తులతో దాడి చేసినట్లు తెలిపారు. తీవ్ర గాయాలతో భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన అనంతరం నిందితులు మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. మృతదేహాన్ని పోస్టుమా ర్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోంది.

# సింగరేణిని కాపాడింది బీజేపీయే

- భట్టి విక్రమార్క వాస్తవాలు గుర్తు చేసుకుని మాట్లాడాలి
- బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి
- తాడిచెర్ల బ్లాక్–2 కేటాయింపుతో సింగరేణి, మంథని అభివృద్ధికి కొత్త అవకాశాలు



ప్రజానావ, మంథని : సింగరేణి భవిష్యత్తు, కార్మికుల సంక్షేమం, మంథని అభివృద్ధే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ చేపట్టిన సింగరేణి భరోసా యాత్ర ప్రజల్లో కొత్త ఆశలను నింపిందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. మంథని లోని రామ్‌రెడ్డి కాంప్లెక్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షు డు ఎన్. రామచంద్రరావు, శాసనసభాపక్ష నాయకు డు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతిని ధులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్న ఈ యాత్ర సింగరేణి కార్మికులు, మంథని ప్రజల్లో విశ్వాసాన్ని పెంచిందన్నారు. మంథని ప్రాంతంలో బొగ్గు, గోదావరి జలాలు, ఇసుక వంటి సహజ వనరులు సమృద్ధిగా ఉన్నప్పటికీ పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు లేక అభివృద్ధిలో వెనుకబడిందని పేర్కొన్నారు. కాళేశ్వరం, సింగరేణి వంటి కీలక వనరు లు మంథనితో ముడిపడి ఉన్నప్పటికీ స్థానిక యువతకు ఆశించిన స్థాయిలో ఉద్యోగాలు లభించలే దన్నారు. మంథని నుంచి మంత్రులు, స్పీకర్లు, దేశ ప్రధానమంత్రి స్థాయికి ఎదిగిన నాయకులు ఉన్నప్పటి కీ ప్రాంత అభివృద్ధికి తగిన ప్రాధాన్యం దక్కలేదని విమర్శించారు. ఒకప్పుడు లక్షా నలభై వేల నుంచి లక్షా యాభై వేల మంది ఉద్యోగులు పనిచేసిన సింగరేణిలో ప్రస్తుతం సుమారు 35 వేల మంది మాత్రమే పనిచేస్తున్నారని, ఈ పరిస్థితికి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల విధానాలే కారణమని ఆరోపిం చారు. రాష్ట్ర ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉన్నప్పటికీ సింగరేణిని బలోపేతం చేయకుండా ఆదాయ వనరుగా మాత్రమే ఉపయోగించుకుందని విమర్శించారు. జెన్‌కోతో పాటు ఇతర ప్రభుత్వ సంస్థలు చెల్లించాల్సిన బకాయిలు పెరగడంతో సింగరేణిపై ఆర్థిక భారం అధికమై కార్మికుల జీతాలు, ఇంక్రిమెంట్లు, బోనస్‌లపై ప్రతికూల ప్రభావం పడిందన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 2013 తర్వాత జరిగిన పరిణామాలను గుర్తు చేసుకుని మాట్లాడాలని సూచించారు. బొగ్గు గనుల కేటాయింపుల వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని పాత కేటాయింపులను రద్దు చేసి, భవిష్యత్తులో వేలం విధానం ద్వారానే కేటాయింపులు జరగాలని ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల్లోనూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తాడిచెర్ల బ్లాక్–2ను ఎలాంటి ప్రైవేట్ టెండర్లు లేకుండా నేరుగా సింగరేణికి కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. మంథని బీజేపీ నాయకుల విజ్ఞప్తి మేరకు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఈ అంశాన్ని ప్రధాన మంత్రి దృష్టికి తీసుకెళ్లి కేటాయింపు జరిగేలా కీలక పాత్ర పోషించారని తెలిపారు. తాడిచెర్ల బ్లాక్–2 కేటాయింపుతో మైనింగ్, అనుబంధ పరిశ్రమలు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పడి స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. దీంతో మంథని కూడా రామగుండం, భూపాలపల్లి, మంచిర్యాల తరహాలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశాలు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. ఏఎమ్మార్ సంస్థ స్థానిక ప్రజల భూములు తీసుకున్నప్పటికీ స్థానిక యువతకు తగిన ఉద్యోగాలు కల్పించడం లేదని ఆరోపిస్తూ, నిరుద్యోగులకు ఉపాధి కల్పించకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సింగరేణిని పరిరక్షించడం, కార్మికుల ప్రయోజనాలను కాపాడటం, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, మంథని అభివృద్ధికి కృషి చేయడం భారతీయ జనతా పార్టీ లక్ష్యమని చందుపట్ల సునీల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కొండపాక సత్యప్రకాశ్, బోగోజు శ్రీనివాస్, సిలివేరి సతీష్, లక్ష్మణ్, అశోక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ఒక్క ఓటరూ హక్కు కోల్పోవద్దు

ప్రజానావ, సిద్దిపేట: సిద్దిపేట నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కోల్పో కుండా చూడాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ నాయ కులు, బూత్ ఏజెంట్లు, కార్యకర్తలపై ఉందని తెలం గాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్, మెదక్ పార్ల మెంట్ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ జివి వెన్నెల అన్నారు. సిద్ధిపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్ తో కలిసి పట్టణంలోని 10, 11, 8, 6, 28, 29, 30, 4, 20, 21 వార్డుల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లే సమయం లో కాంగ్రెస్ బూత్ ఏజెంట్లు కూడా వారితో కలిసి వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించాలని, ఎన్యుమ రేషన్ ఫారాలను సక్రమంగా నింపేందుకు సహక రించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నా రు. ప్రజాకవి గద్దర్ తన ఆట, పాటల ద్వారా తెలం గాణ ఆత్మగౌరవాన్ని, ఓటు హక్కు ప్రాధాన్యాన్ని ప్రజల్లో చైతన్యపరిచారని పేర్కొన్న ఆమె, తెలంగాణ చరిత్ర ఉన్నంతకాలం గద్దర్ సేవలను మరువలే మని, ఆయన స్ఫూర్తిని భావితరాలకు చేరవేయా ల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కలీముద్దీన్, బొమ్మల యాదగిరి, లక్ష్మి, దాస్ అంజ య్య, రషీద్, వహాబ్, గయాస్, విజయ్, అంజిరెడ్డి, రాములు, మార్క సతీష్, రాజబహదూర్ రెడ్డి, బాలయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



# ఇది కాలం వల్ల వచ్చిన కరువు కాదు

- కాంగ్రెస్ అసమర్థ పాలన వల్ల వచ్చిన కరువు
- బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో మానేరు నదిలో వాలీబాల్ ఆడి నిరసన
- బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్

ప్రజానావ, సిరిసిల్ల : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ మూడు సంవత్సరాల కాలంలో సిరిసిల్ల పట్టణ కేంద్రంలోని మానేరు నది ఎడారిలా మారింది. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పది సంవత్సరాల కాలంలో కాళేశ్వరం నుండి వచ్చిన నీళ్ల ద్వారా బ్యాక్ వాటర్ సిరిసిల్ల బ్రిడ్జి కింద దాకా ఉండి నిరంతరం నీటి ప్రవాహం తో ఒక జీవ నదిలా ఉండేది. దానివల్ల సిరిసిల్ల ప్రజలకు తగు నీరు, అలాగే రైతులకు సాగునీరు, పరిశ్రమలకు నీటి సరఫరా నిరంతరా యంగా ఉండేది. మీడ్ మానేరులో పూర్తిస్థాయిలో నీరు ఉండడం వల్ల సిరిసిల్ల పట్టణంలోని భూగర్భ జలాల నీటిమట్టం పెరిగింది కానీ ఈ కాంగ్రెస్ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టి కొన్ని వేల కోట్ల రూపాయల ఇసుకను అక్రమ మార్గంలో అమ్ముకుంటున్నారు. ప్రాణహిత నదిలో నీటిమట్టం ఉన్నప్పటికీ నీటి నెత్తిపోయకుండా మిడ్ మానేరును ఎండ పెట్టారు. దానివల్ల మానేరు మొత్తం ఎడారిలో మారిపోయి సిరిసిల్ల పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు రైతులకు సాగునీటి కష్టాలు ఏర్పడ్డాయి. అదేవిధంగా భూగర్భ జలాలు తీవ్రస్థాయిలో పడిపోవడం వల్ల వందల ఫీట్లు బోర్లు వేసినప్పటికీ నీళ్లు పడడం లేదు. మొన్నటికి మొన్న కేటీఆర్, హరీష్ రావు లు రైతులు చచ్చిపోతున్నారు, నీళ్లు ఇవ్వండి అంటే మీ రక్తం రైతుల పొలాల్లో చల్లుకోండి అంటూ ఒక సైకో లాగా మాట్లాడిన రేవంత్ రెడ్డి నువ్వు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు కేటీఆర్ పై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని, ఇప్పటికైనా పంపులు ఆన్ చేసి నీటిని లిఫ్ట్ చేసి ప్రజల నీటి కష్టాలు తొలగించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులందరికీ సాగునీళ్లు ఇవ్వకపోతే కేటీఆర్ చెప్పినట్టు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కన్నెపల్లి పంప్ హౌస్ ను లక్ష మందితో పంపులు ఆన్ చేస్తామని బీఆర్ఎస్వి పక్షాన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాచమల్లు మోహన్, గజభింకర్ చిరంజీవి, సోఫియన్, గడ్డం హరీష్, చిన్న వెంకటేష్, గాజుల మణిదీప్ తదితరులు పాల్గొన్నారు

కొత్త బొగ్గు గనుల కేటాయింపుతోనే

# సింగరేణి భవిష్యత్‌కు భరోసా

- జీడీకే–1 గనిలో ఐఎన్‌టీయూసీ బాయి బాట గేట్ మీటింగ్
- కార్మికుల హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాడేది ఐఎన్‌టీయూసీయేనని స్పష్టంచేసిన నాయకులు




ప్రజానావ, రామగుండం: ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డా. బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు జీడీకే–1 ఇంక్లైన్ గనిలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో బాయి బాట కార్యక్రమంలో భాగంగా గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి నరసింహారెడ్డి, ఆర్జీ–1 వైస్ ప్రెసిడెంట్ సదానందం మాట్లాడుతూ సింగరేణి సంస్థ మనుగడకు కొత్త బొగ్గు గనుల కేటాయింపు అత్యంత అవసరమని, కొత్త గనులు అందుబాటులోకి వస్తేనే ఉపాధి అవకాశాలు పెరిగి సంస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నైనీ బ్లాక్‌లో ఉత్పత్తి ప్రారంభానికి చర్యలు తీసుకోవడంతో పాటు తాడిచర్ల బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డా. బి. జనక్ ప్రసాద్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం, అప్పటి గుర్తింపు సంఘం హయాంలో చోటుచేసుకున్న అవకతవకల కారణంగా మెడికల్ బోర్డు ప్రక్రియ నిలిచిపోయిందని, డా. జనక్ ప్రసాద్ ప్రత్యేక చొరవతో తిరిగి మెడికల్ బోర్డు ఏర్పాటు జరిగిందన్నారు. అనారోగ్య కారణాలతో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులకు న్యాయం జరిగేలా అర్హులైన వారిలో కనీసం 90 శాతం మందిని అన్‌ఫిట్‌గా ప్రకటించాలని డా. జనక్ ప్రసాద్ యాజమాన్యాన్ని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. కార్మికులను యాజమాన్యం అనవసరంగా ఇబ్బందు లకు గురిచేస్తే ఐఎన్‌టీయూసీ ఎల్లప్పుడూ వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ యాజమాన్యం లేదా రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి కార్మికులకు ప్రయోజనం చేకూర్చే ఒక్క ముఖ్యమైన ఒప్పందం కూడా సాధించలేదని విమర్శించారు. సింగరేణిలో కార్మికులకు అవసరమైన పనిముట్లు, భద్రతా పరికరా లు తగినంతగా అందుబాటులో లేవని, యాజ మాన్యం వెంటనే నాణ్యమైన పనిముట్లు, భద్రతా సామగ్రిని అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడే ఏకైక కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీయేనని, భవిష్యత్తులో కూడా అదే స్ఫూర్తితో పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీలు గడ్డం కృష్ణ, రాజేందర్, వడ్డేపల్లి దాస్, కూశనపల్లి శంకర్, నవీన్, జనగామ రాజేష్, అల్లావుద్దీన్, బ్రాంచ్ సెక్రటరీ గుండేటి శ్రీనివాస్, ఏరియా ఆసుపత్రి ఫిట్ సెక్రటరీ కుమార్, ఓసీపీ–5 ఫిట్ సెక్రటరీ ఆంజనేయులు, సివిల్ ఫిట్ సెక్రటరీ శ్రీనివాస్, జీడీకే–1 ఇంక్లైన్ ఫిట్ సెక్రటరీ రమేష్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ ప్రసాద్, ఇంక్లైన్ ఇన్‌చార్జి కోలిపాక శ్రీనివాస్, బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ అనిల్, షిఫ్ట్ ఇన్‌చార్జులు బి. రామన్న, ఎస్. మొగిలి, ఎం. రాజన్న, ప్రసాద్, నాయకులు రాజ్‌కుమార్, కత్తెర్ల శ్రీనివాస్, కనకయ్య, వెంకటేష్, చరణ్యకుమార్, వంశీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలి

కలెక్టర్ గరిమ అగ్రవాల్




ప్రజానావ, సిరిసిల్ల : వర్షాలు కురిసిన తరువాతే మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో వివిధ శాఖల ఆద్వర్యంలో మొక్కలు నాటే లక్ష్యంపై జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, పలు శాఖలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచాలని ఆదేశించా రు. వివిధ పథకాల కింద గతంలో నాటిన మొక్కలు ఎండిపోయిన, పెరగకపోయిన వాటిని అటవీశాఖ అధికారులు పరిశీలించాలని సూచించారు. వర్షాలు కురిసిన తరువాతే ఏర్పాట్లు చేసి.. వన మహోత్సవం లో భాగంగా మొక్కలు నాటాలని పిలుపు నిచ్చారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపా లిటీల్లో నర్సరీలు ఉండాలని స్పష్టం చేశారు. వన మహోత్సవంలో భాగంగా ఆయా శాఖలకు కేటాయించిన మొక్కల లక్ష్యం మొత్తం 8,65,200 గా లక్ష్యాన్ని నిర్ణయించామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మి నారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం. జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతి, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన భూగర్భ జలవనరుల శాఖ అధికారి

- సూర్యాపేట జిల్లా కార్యాలయంలో ట్రాప్ నిర్వహించిన ఏసీబీ అధికారులు
- అధికారితో పాటు పొరుగు సేవల ఉద్యోగిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు



ప్రజానావ, సూర్యాపేట: సూర్యాపేట జిల్లా భూగర్భ జలవనరుల శాఖ అధికారి బాలు రూ.20 వేల లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. జిల్లా కేంద్రంలోని భూగర్భ జలవనరుల శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ట్రాప్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. నల్గొండ ఏసీబీ డీఎస్పీ జగదీష్ చందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ బోర్ రిగ్ యజమాని కొత్తగా రిగ్‌ను కొనుగోలు చేసి బోర్‌వెల్ తవ్వకాల పనులు చేపట్టగా, అనుమతి లేకుండా బోర్ వేయరాదని పొరుగు సేవల ఉద్యోగి కాసోజు వెంకటేశ్వర్లు సూచించాడు. అనంతరం రిగ్ యజమాని జిల్లా కార్యాలయానికి వెళ్లగా, అనుమతుల కోసం జిల్లా భూగర్భ జలవనరుల శాఖ అధికారి బాలు రూ.20 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. దీంతో బాధితుడు ఈ నెల 10న ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ముందస్తు ప్రణాళికతో ట్రాప్ నిర్వహించిన ఏసీబీ అధికారులు బుధవారం ఫిర్యాదుదారుడి నుంచి పొరుగు సేవల ఉద్యోగి వెంకటేశ్వర్లు ద్వారా రూ.20 వేల లంచం స్వీకరిస్తుండగా అధికారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం భూగర్భ జలవనరుల శాఖ అధికారి బాలు, పొరుగు సేవల ఉద్యోగి వెంకటేశ్వర్లపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన అధికారులు, వారిని రిమాండ్‌కు తరలించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
విలేకరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.
మండలాలు, అర్బన్, పట్టణ కేంద్రాల్లో పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్
స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జీలకు కనీస అర్హత డిగ్రీ ఉండాలి
మీ బయోడేటాను ఇప్పుడే ఈ నెంబర్లకు వాట్సాప్ చేయండి
9948433277, 9014966169



# నదుల అనుసంధానమే పరిష్కారం

EDITORIAL

రాష్ట్రాల మధ్య తగవులు తీరాలంటే ఇదే మంచి పద్ధతి. నదుల్లో నీరు సముద్రంలోకి వృధాగా పోకుండా మళ్లింపు చర్యలు తీసుకోవాలి. దీనికి నదుల అనుసందా నం చేయాలి. అలాగే నీటి సంరక్షణను ంద్రం ఆధీనంలోకి తీసుకుని ఆయా రాష్ట్రాల అవసరాలను నెరవేర్చగలగాలి. ఇది చాలా ప్రధాన మైన సమస్య. ఈ వర్షాకాల సమావేశంలో పార్లమెంట్ దీనిపై ఎన్ని రోజులైనా చర్చించాలి. అలాగే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఎన్ని వేల కోట్లు అయినా నిధులు టాయించాలి. అప్పుడే దేశం ఎల్ నినో లాంటి పరిస్థితులు వచ్చినా తట్టు కుంటుంది. ఎల్‌నినో ప్రభావా న్ని మనం ఆపలేం కనుక, దాని వల్ల కలిగే నష్టాన్ని తగ్గించవచ్చు.

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాలు వెనక్కి పోయాయి. ఇప్పట్లో వానలు పడతాయన్న భరోసా లేదు. ఈ క్రమంలో తాగు, సాగునీటి సమస్యలతో పాటు ఆహార పదార్థాల లభ్యతపైనా ఆందోళన కలుగుతోంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ చర్యలపై ంద్రం నిర్ణయాలు తీసుకోవాలి. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ సమావేశాల్లో ఎల్‌నినో పరిస్థితులు, ప్రత్యామ్నాయాలపై చర్చించాలి. సాగు, తాగునీటికి శాశ్వత ప్రణాళికలపై చర్చించాలి. వలం రాజకీయ ఎజెండాలతో ముందుకు సాగకుండా, వాటి ని పక్కన పెట్టి ప్రజల కోసం నేతలు ఆలోచన చేయాలి. నదుల అనుసం ధానం ఇందులో ప్రధానమైన సమస్య. మనదేశంలో ఎన్నో జీవనదులు ఉన్నాయి. వీటిని సన్మార్గం పట్టిస్తే దేశంలో కరువు కాటకాలకు వీలుం డదు. నదులను అనుసంధానించడం, జలరక్షణను జాతీయ విధానంగా తీసుకోవడం తక్షణావసరంగా గుర్తించాలి. రాష్ట్రాల మధ్య తగవులు తీరాలంటే ఇదే మంచి పద్ధతి. నదుల్లో నీరు సముద్రంలోకి వృధాగా పోకుండా మళ్లింపు చర్యలు తీసుకోవాలి. దీనికి నదుల అనుసందా నం చేయాలి. అలాగే నీటి సంరక్షణను ంద్రం ఆధీనంలోకి తీసుకుని ఆయా రాష్ట్రాల అవసరాలను నెరవేర్చగలగాలి. ఇది చాలా ప్రధాన మైన సమస్య. ఈ వర్షాకాల సమావేశంలో పార్లమెంట్ దీనిపై ఎన్ని రోజులైనా చర్చించాలి. అలాగే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఎన్నివేల కోట్లు అయినా నిధులు టాయించాలి. అప్పుడే దేశం ఎల్ నినో లాంటి పరిస్థితులు వచ్చినా తట్టుకుంటుంది. ఎల్‌నినో ప్రభావా న్ని మనం ఆపలేం కనుక, దాని వల్ల కలిగే నష్టాన్ని తగ్గించవచ్చు. అందుకు ఇప్పటి నుంచే సరైన ప్రణాళిక, శాస్త్రీయ దృష్టి, సమర్థమైన ప్రభుత్వ విధానాలు, రైతులకు సకాలంలో మద్దతు అత్యవసరం. లేక పోతే వాతావరణ సంక్షోభం వలం వ్యవసాయాన్నే కాదు.. దేశ ఆహా ర భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కోట్లాది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. భారతదేశంలో దాదాపు 60 శాతం వ్యవసాయం ఇప్పటికీ వర్షాలపైనే ఆధారపడి ఉంది. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, పత్తి వంటి పంటలు ఎక్కువగా వర్షాధార ప్రాంతాల్లోనే సాగవుతాయి. వర్షాలు తగ్గితే దిగుబడులు పడిపోతాయి. రైతుల ఆదాయం తగ్గుతుంది. అప్పులు పెరుగుతాయి. చివరకు దేశ ఆహార భద్రత డా ప్రమాదంలో పడుతుంది. అందు వాతావరణ మార్పు అనేది వలం ప్రకృతి సమస్య కాదు.. అది ఆర్థిక, సామాజిక, ఆహార భద్రతకు సంబంధించిన పెద్ద సవాల్‌గా గుర్తించాలి. ఇటీవలి సంవత్సరాల్లో భారతదేశం తీవ్ర వాతావరణ వైపరీత్యాలను వరుసగా చూస్తోంది. ఒకవైపు రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మరోవైపు కొద్ది గంటల్లోనే నెల రోజుల వర్షం కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూన్‌లో భారీ వర్షాలు, ఆగస్టు లేదా అక్టోబరులో తీవ్ర పొడి వాతావరణం వంటి అసాధారణ పరిస్థితులు సాధారణమైపోతున్నాయి. పశ్చిమ వాతావరణ కల్లోలాలు, వేడి గాలులు, ఆకస్మిక తుఫాన్లు సంప్రదాయ వాతావరణ చక్రాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ పరిస్థితుల్లో రైతులు గత అనుభవాల ఆధారంగా పంటలు వేయడం ప్రమాదకరంగా మారుతోంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం వలం రైతుల పరిమితం కాదు. మార్కెట్లో ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతుంది. గోధుమలు, బియ్యం, పప్పులు, వంటనూనెల ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం డా అధికమవుతుంది. గతంలో గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుమతులపై ఆంక్షలు విధించాల్సి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం దేశీయ అవసరాలను ముందుగా తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడటమే. వాతావరణ మార్పులు ఇప్పుడు భవిష్యత్ ప్రమాదం కాదు.. వర్తమాన వాస్తవం. ఒకప్పుడు ఋతువులు సమయానికి వచ్చేవి. వర్షాలు ఒక క్రమంలో కురిసేవి. రైతులు వాటిని ఆధారంగా చేసుకుని సాగు ప్రణాళికలు రూపొందించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రపంచ పరిస్థితులు కూడా భారత్‌కు కొత్త సవాళ్లు విసురు తున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు కారణంగా ఇంధనాలు, ఎరువులు, ఖనిజాల ధరలు పెరుగుతున్నాయి. ఇవి వ్యవసాయ వ్యయాన్ని మరింత పెంచుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల నిల్వలు ఉన్నప్పటికీ, రబీ సీజన్‌కు సరిపోతాయా అనే సందేహాలు ఉన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా పంటలపై తెగుళ్లు పెరిగితే పురుగుమందుల అవసరం కూడా అధికమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు మాత్రమే సరిపోవు. రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపిక, సాగు పద్ధతులు మార్చుకోవాలి. మట్టిలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం కూడా అత్యంత అవసరం. ఆవుపేడ, కంపోస్ట్, పెరటి ఎరువులు, జీవబొగ్గు వంటి సహజ వనరులను వినియోగించడం ద్వారా నేల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీంతో వర్షాలు ఆలస్యమైనా పంటలకు రక్షణ లభిస్తుంది. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో పంటల బీమా వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలి.

మట్టిలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం కూడా అత్యంత అవసరం. ఆవుపేడ, కంపోస్ట్, పెరటి ఎరువులు, జీవబొగ్గు వంటి సహజ వనరులను వినియోగించడం ద్వారా నేల నీటిని నిల్వ చేసుకునే సామ ర్థ్యం పెరుగుతుంది. దీంతో వర్షాలు ఆలస్యమైనా పంటలకు రక్షణ లభి స్తుంది. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.



## భద్రాద్రిలో వైభవంగా నిత్య కల్యాణం

- శ్రీరామ్ నామస్మరణ మధ్య భక్తివిభోరంగా స్వామివారి కల్యాణం
- నిత్య అన్నదానానికి రూ.1,11,111 విరాళం అందజేసిన విజయవాడ దంపతులు

**ప్రజానావ, భద్రాచలం:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో బుధవారం నిత్య కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ అర్చకులు సుప్రభాత సేవతో ఆలయ తలుపులు తెరిచి అర్చన, ఆరాధన, బాలభోగం, నివేదన కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. ఉత్సవమూర్తులను కళ్యాణ మూర్తులుగా సుందరంగా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ బేడా మండపానికి తీసుకొచ్చి పుణ్యాహవచనం, యజ్ఞోపవీత ధారణ తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ప్రవరాలు పఠిస్తూ వేదమంత్రోచ్చారణల మధ్య నిత్య కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం అంతా భక్తులు జై శ్రీరామ్... జై జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగింది. విజయవాడ భవానీపురానికి చెందిన పమిడిపాటి పట్టాభిరామయ్య దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో నిత్యం నిర్వహించే అన్నదాన కార్యక్రమం కోసం రూ.1,11,111 విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ లింగాల సాయిబాబాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కే. దామోదర్‌రావు, అర్చకులు, వేదపండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పారదర్శక పాలనకు ప్రాధాన్యం ఇవ్వాలి

- కలెక్టర్ దివాకర టీఎస్
- ఉద్యోగులు ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజ్ సద్వినియోగం చేసుకోవాలి
- అభివృద్ధి పనులకు ఆన్‌లైన్ ద్వారానే ఇసుక బుకింగ్
- ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు గడువులోగా పూర్తి చేయాలి



**ప్రజానావ, ఖమ్మం:** జిల్లాలో ప్రభుత్వ సేవలు, అభివృద్ధి పనులు, ఎన్నికల ప్రక్రియల్లో పారదర్శకత, సమర్థతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పలు సమావేశాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు ఎస్‌బీఐ స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ శాలరీ ప్యాకేజ్ ద్వారా లభించే ప్రయోజనాలు, ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఆన్‌లైన్ ద్వారా ఇసుక సరఫరా, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

### ఉద్యోగులకు ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజ్ ప్రయోజనాలు..

ముందుగా కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూపొందించిన స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ శాలరీ ప్యాకేజ్ (ఎస్‌జీఎస్‌పీ) కరపత్రాలను ఆవిష్కరించిన కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈ పథకం ద్వారా లభించే ప్రత్యేక బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాధారణ శాలరీ ఖాతాలను ఎస్‌జీఎస్‌పీ ఖాతాలుగా మార్చుకోవడం ద్వారా రూ.1 కోటి వరకు ఉచిత ప్రమాద బీమా, కుటుంబ సభ్యులకు ఎస్‌బీఐ రిష్తే ద్వారా ప్రత్యేక బ్యాంకింగ్ సేవలు, తక్కువ వడ్డీ రేట్లపై వ్యక్తిగత, గృహ, వాహన రుణాలు, యోనో వంటి ఆధునిక డిజిటల్ బ్యాంకింగ్ సేవల ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. సమీప ఎస్‌బీఐ శాఖలను సంప్రదించి ఖాతాలను మార్చుకోవాలని ఉద్యోగులకు సూచించారు.

### ఇసుక సరఫరా పూర్తిగా ఆన్‌లైన్‌లోనే..

అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ ఇంజినీరింగ్ శాఖల అధికారులతో ఇసుక సరఫరాపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ప్రభుత్వ అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుక సరఫరా పూర్తిగా ఆన్‌లైన్ బుకింగ్ ద్వారానే జరగాలని స్పష్టం చేశారు. టీజీఎండీసీ, స్యాండ్ బజార్ల ద్వారా మాత్రమే ఇసుక బుకింగ్ చేయాలని, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులకు వినియోగించిన ఇసుక వివరాలను సమగ్రంగా సమర్పించాలని ఆదేశించారు. అన్ని స్యాండ్ బజార్లలో తగిన నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇసుక రీచ్‌ల ద్వారా వచ్చిన ఆదాయాన్ని నిబంధనల ప్రకారం గ్రామపంచాయతీలకు పంపిణీ చేయాలని సూచించారు. అభివృద్ధి పనులు నిర్ణీత గడువులో పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు.

### పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ..

అదే రోజు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బీఎల్‌వోలు జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 28 నాటికి వాటిని పరిష్కరించి అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని తెలిపారు. జిల్లాలో మొత్తం 12,43,781 మంది ఓటర్లలో ఇప్పటివరకు 8,48,491 మంది (68.22 శాతం) వివరాలు డిజిటలైజ్ చేసినట్లు వెల్లడించారు. మ్యాపింగ్ పూర్తికాని సుమారు 25 వేల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వారు మీ సేవ ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అర్హుల పేర్లను తుది జాబితాలో చేర్చుతామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా సహకరించి వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ వనపల్లి శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్ రామ్ బరన్, ఎల్‌డీఎం ఎ. రవిప్రసాద్, పీఆర్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్‌రావు, టీజీఎండీసీ అధికారులు, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

- ఆసుపత్రి డెవలప్‌మెంట్ సొసైటీ తొలి సమావేశంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్
- నాణ్యమైన వైద్య సేవలు, మౌలిక సదుపాయాల మెరుగుదల, నిధుల పారదర్శక వినియోగంపై దృష్టి




**ప్రజానావ, సూర్యాపేట:** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్, ఆసుపత్రి డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఆసుపత్రి డెవలప్‌మెంట్ సొసైటీ తొలి సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి ఆసుపత్రి అభివృద్ధి, వైద్య సేవలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ నిధుల ఆదాయం, వ్యయం, ప్రస్తుతం అందుతున్న వైద్య సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు, రాజీవ్ ఆరోగ్యశ్రీ చికిత్సలు, ఓపీ సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, రోగులతో వ్యవహరించే విధానం, భవిష్యత్ అవసరాలపై అధికారులు సభ్యులకు వివరించారు. అనంతరం కలెక్టర్ ఆసుపత్రిలో రోగుల సంఖ్య, అత్యవసర వైద్య సేవలు, ఔట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ సేవలు, మందుల లభ్యత, శస్త్రచికిత్సల నిర్వహణ, వైద్య పరికరాల అందుబాటు, పరిశుభ్రత, మౌలిక వసతులు, సిబ్బంది అవసరాలు, డెవలప్‌మెంట్ సొసైటీ నిధుల వినియోగంపై విస్తృతంగా సమీక్షించారు. ఆసుపత్రి పరిపాలనపై నిరంతర నిఘా ఉండాలని సూచిస్తూ ఓపీ, ఇన్‌పేషెంట్, బ్లడ్ బ్యాంక్, డయాలసిస్, టీబీ సేవల పనితీరును పరిశీలించారు. అత్యవసర మందులు, శస్త్రచికిత్సలకు అవసరమైన ఇంప్లాంట్లు, వినియోగ వస్తువులు, ల్యాబ్ రియాజెంట్లు, ఇతర వైద్య సామగ్రి ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డయాగ్నస్టిక్ సెంటర్‌లో నిర్వహించే పరీక్షలను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించి, నివేదికలను రోగులకు సకాలంలో అందించాలని సూచించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి రోగికి మెరుగైన సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రికి అవసరమైన ఫర్నిచర్, వైద్య పరికరాలను ఆరోగ్యశ్రీ నిధులతో కొనుగోలు చేయాలని, హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ విభాగం కింద సేవలను పూర్తి స్థాయిలో అందించాలని సూచించారు. ఆసుపత్రి అవసరాలకు సంబంధించిన వైద్య పరికరాల కొనుగోలు, మరమ్మతులు, వార్డుల అభివృద్ధి, సివిల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, ఇతర మౌలిక వసతుల కల్పనను ప్రాధాన్యతతో చేపట్టి నిధులను నిబంధనల మేరకు సమర్థవంతంగా వినియోగించాలని, ప్రతి ఏడాది ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. సిబ్బంది హాజరుపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో హాజరు నమోదు చేసి విధి నిర్వహణ స్థలం విడిచిపెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలందించాలని, రోగులతో మర్యాదగా, సానుభూతితో వ్యవహరించాలని చెప్పారు. ముఖ్యంగా ఓపీ విభాగానికి వచ్చే రోగులు ఎండ, వర్షాల నుంచి ఇబ్బందులు పడకుండా ఓపీ ముందు రేకులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆమోదించిన అభివృద్ధి పనులు, కొనుగోళ్లు నిర్ణీత గడువులో పూర్తిచేసి తదుపరి సమావేశంలో పురోగతి నివేదిక సమర్పించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ మొరిశెట్టి నివేదిత మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మానవతా దృక్పథంతో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరగా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. పి. శ్రావణ్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేసి ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డీఎంఈ (అకాడమిక్) డా. ఎం. రామాదేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. పి. వెంకటరమణ, డా. బి. జనార్ధన్, డా. ఎస్. గీతావాణి, డా. ఎస్. వెంకటేశ్వర్లు, సభ్య కార్యదర్శి పి. శారద, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, ఆసుపత్రి డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు, వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## శాంతియుత దీక్షలపై పోలీసుల ఉక్కుపాదం!

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** తమ గ్రామాన్ని నాగర్‌కర్నూల్ జిల్లాలోనే కొనసాగించాలంటూ తలుపునూరులో అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 30వ రోజుకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో దీక్షా ప్రాంగణంలో శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్న సుమారు 10 మంది గ్రామ పెద్దలు, కుల సంఘాల నాయకులు, వివిధ పార్టీల ప్రతినిధులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారు. అధికార పక్ష నాయకుల ఒత్తిడితోనే పోలీసులు ఈ దౌర్జన్యానికి పాల్పడ్డారని జిల్లా సాధన కమిటీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 4 వేల ఎకరాల భూభాగం, 2 వేల పైచిలుక ఓటర్లు ఉన్న తలుపునూరు ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయ రంగాల పరంగా నాగర్‌కర్నూల్ జిల్లానే అత్యంత సమీపంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు రాజకీయ స్వార్థం కోసం ఎమ్మెల్యేకు తప్పుడు సమాచారం ఇస్తూ గ్రామానికి అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా హక్కుల కోసం పోరాడుతున్న వారిని అరెస్ట్ చేయడం దుర్మార్గమని, అరెస్టయిన వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## పెదగూడెంలో 'సర్' ప్రక్రియను పరిశీలించిన డీసీసీ చీఫ్

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** వనపర్తి మండలం పెదగూడెం గ్రామంలో కొనసాగుతున్న సర్ ప్రక్రియ డెస్క్‌ను బుధవారం వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎల్‌ఏ–2లు, ఇన్‌చార్జ్‌లు నిరంతరం ఓటర్లకు అందుబాటులో ఉంటూ ఓటు నమోదు అప్‌లోడ్ ప్రక్రియలో సహకరించాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న బీఎల్‌ఓలతో సమన్వయం చేసుకుంటూ.. నిర్దేశిత గడువులోగా నాణ్యతతో ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుష్పలత శివకుమార్, మాజీ సర్పంచ్ కొండయ్య, నాగన్న, భాస్కర్ రెడ్డి, రమేష్, శివకుమార్, బుచ్చిబాబు, సురేష్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శారదమ్మ, విష్ణువర్ధన్ రెడ్డి, మల్లేష్, గుండాల రాములు, బాలు తదితరులు పాల్గొన్నారు



## రేపు 'దళిత అస్తిత్వ రాజకీయాలు' పుస్తక చర్చ

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** కారంచేడు దళిత మృతవీరుల సంస్మరణార్థం ఈ నెల 17న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రత్యేక పుస్తక చర్చా కార్యక్రమం జరగనుంది. 'కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి' ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ చర్చ నిర్వహిస్తున్నారు. ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు రచించిన 'దక్షిణ భారతదేశంలో కుల ఆధిపత్యం మరియు ప్రతిఘటన దళిత అస్తిత్వ రాజకీయాలు' పుస్తకంపై పలువురు యూనివర్సిటీ ప్రొఫెసర్లు, మేధావులు ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం వనపర్తిలో ఈరపాగ గోవిందు, సైదామ్మ, తదితరులు కరపత్రాలు ఆవిష్కరించారు.





# సిద్దిపేటలో రెండు భారీ చోరీ కేసుల ఛేదన

- వాహన దొంగ అరెస్ట్.. నాలుగు వాహనాలు, మాస్టర్ కీలు స్వాధీనం
- ఇంటి చోరీ కేసులో 80 తులాల బంగారం, 5.5 కిలోల వెండి రికవరీ

**ప్రజానావ, సిద్దిపేట:** సిద్ధిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో చిన్నకోడూరు, దుబ్బాక పోలీస్ స్టేషన్లలో నమోదైన రెండు కీలక చోరీ కేసులను పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఒక కేసులో వరుస వాహన చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి నాలుగు వాహనాలతో పాటు మాస్టర్ కీలను స్వాధీనం చేసుకోగా, మరో కేసులో దుబ్బాకలో జరిగిన భారీ ఇంటి చోరీ కేసును ఛేదించి సుమారు 80 తులాల బంగారు ఆభరణాలు, 5.5 కిలోల వెండి ఆభరణాలను రికవరీ చేశారు. చిన్నకోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పియాగో ఆటో చోరీ కేసు దర్యాప్తులో వెల్దుర్తి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జొన్నల సాయికుమార్ (26)ను అదుపులోకి తీసుకుని విచారించగా, మద్యానికి బానిసై డబ్బుల కోసం రాత్రి వేళల్లో నిర్లక్ష్యంగా పార్క్ చేసిన వాహనాలను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. అతడి ఇంటి వెనుక భాగంలో దాచిన రెండు ఆటోలు, ఒక స్కూటీ, ఒక పల్సర్ బైక్‌తో పాటు వాహనాల లాకులు తెరవడానికి ఉపయోగించిన మూడు మాస్టర్ కీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో కామారెడ్డి, మేడ్చల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు కేసులు నమోదైనట్లు వెల్లడించారు. దుబ్బాకలో తీర్థయాత్రకు వెళ్లిన కుటుంబం ఇంట్లో జరిగిన భారీ చోరీ కేసును ఛేదించేందుకు పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ఐపీఎస్ పర్యవేక్షణలో ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా దర్యాప్తు చేపట్టారు. వందలాది సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి చిక్కుడు కృష్ణ అలియాస్ వెంగాలి బిక్షపతి (37)ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు ఇంటి కిటికీ ఊచలను వంచి లోపలికి ప్రవేశించి లాకర్‌లోని బంగారం, వెండి ఆభరణాలు, నగదును అపహరించినట్లు తేలింది. నిందితుడి వద్ద నుంచి 80 తులాల బంగారు ఆభరణాలు, 5.5 కిలోల వెండి ఆభరణాలు, రూ.1,300 నగదు, రోల్డ్ గోల్డ్ ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై సిద్ధిపేట, మెదక్, మేడ్చల్, సంగారెడ్డి, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో మొత్తం 63 కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో జైలు వార్డర్ పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ రెండు కేసులను విజయవంతంగా ఛేదించిన పోలీసు బృందాలను పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ అభినందించారు. ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎక్కువ రోజుల పాటు ఇళ్లకు తాళం వేసి వెళ్లే సమయంలో సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



## స్వచ్ఛత - భద్రతను పని సంస్కృతిలో భాగం చేయాలి

- బీపీసీఎల్ స్వచ్ఛత పఖ్వాడాలో భాగంగా సింగరేణి అధికారులకు అవగాహన సదస్సు
- పరిశుభ్రమైన, పచ్చని కార్యస్థలాలే ఉత్పాదకతకు పునాది
- మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు నిబద్ధత చాటిన అధికారులు

**ప్రజానావ, రామగుండం:** భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా రామగుండం ఏరియా–1 పరిధిలో గోదావరిఖనిలోని ఇల్లందు క్లబ్‌లో సింగరేణి అధికారులకు పరిశుభ్రత, పరిశుచితత్వం, కార్యస్థల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇంజనీర్లు, డీజిల్ ఇన్‌ఛార్జీలు, స్టోర్ ఇన్‌ఛార్జీలు సహా పలువురు సింగరేణి అధికారులు పాల్గొని స్వచ్ఛత పఖ్వాడా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పరిశుభ్రమైన, పచ్చని కార్యస్థలాల ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రోత్సాహంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆర్జీ–1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్, ఆర్జీ–2 జనరల్ మేనేజర్ బి. వెంకటయ్య, ఆర్జీ–3 జనరల్ మేనేజర్ ఎస్. మధుసూదన్, ఎస్‌హెచ్‌పీ ఎం. శ్రీనివాస్, ఎన్. రాధాకృష్ణ (ఎంఎం) మాట్లాడుతూ బీపీసీఎల్ చేపట్టిన స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమాన్ని అభినందించారు. పరిశుభ్రతను పాటించడం, సురక్షిత పని విధానాలను అనుసరించడం ఉద్యోగుల శ్రేయస్సుకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. పరిశుభ్రత, భద్రతను కాపాడడం ద్వారా మాత్రమే సమర్థవంతమైన కార్యకలాపాలతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, పరిశుభ్రత కోసం కేటాయించే సమయం ఆరోగ్యకరమైన, మరింత ఉత్పాదకత కలిగిన పని వాతావరణాన్ని సృష్టించేందుకు దోహదపడుతుందని తెలిపారు. బీపీసీఎల్ రాష్ట్ర స్థాయి అధిపతి లక్ష్మిల్ చౌహాన్ మాట్లాడుతూ పరిశుభ్రత, భద్రతను కేవలం ప్రచార కార్యక్రమాలకే పరిమితం చేయకుండా ప్రతి ఉద్యోగి రోజువారీ పని సంస్కృతిలో భాగంగా మలుచుకోవాలని సూచించారు. కార్యస్థల పరిశుభ్రత, భద్రతలో సింగరేణి ఉన్నత ప్రమాణాలను కొనసాగిస్తోందని ప్రశంసిస్తూ, ఉద్యోగులు ఇదే బాధ్యతాయుతమైన విధానాలను కొనసాగించాల ని కోరారు. బీపీసీఎల్ చీఫ్ మేనేజర్ (మార్కెటింగ్) రఘునాథరావు మాట్లాడుతూ పరిశుభ్రత, భద్రత విషయంలో సింగరేణి స్థిరంగా ఆదర్శప్రాయమైన విధానాలను అమలు చేస్తోందని అన్నారు. స్వచ్ఛత పఖ్వాడా ప్రధాన ఉద్దేశం పరిశుభ్రమైన, సురక్షితమైన, పచ్చని కార్యస్థలాల నిర్వహణపై అవగాహనను మరింత బలోపేతం చేయడంతో పాటు సామూహిక బాధ్యతను పెంపొందించడమేనని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణకు దోహదపడటమే కాకుండా కార్యస్థల ప్రమాణాల మెరుగుదలకు కూడా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో సింగరేణి అధికారులు మొక్కలు నాటడంలో ఉత్సాహంగా పాల్గొని పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, కార్యస్థల భద్రతను తమ తమ కార్యాలయాల్లో మరింత సమర్థవంతంగా అమలు చేయాలనే నిబద్ధతను మరోసారి చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బీపీసీఎల్ అధికారులు సింహాచలం, దీపక్ శివాజీతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

Singareni news

## ఏఐటీయూసీపై అనవసర విమర్శలు మానుకోవాలి

- రియాజ్ అహ్మద్ నోరు అదుపులో పెట్టుకోవాలని కవ్వంపల్లి స్వామి హెచ్చరిక
- కార్మికుల హక్కుల కోసం పోరాడిన చరిత్ర ఏఐటీయూసీదేనని స్పష్టం



**ప్రజానావ, రామగుండం:** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఏఐటియుసిపై అనవసర విమర్శలు చేయడం మానుకోవాలని, హెచ్ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి హెచ్చరించారు. గోదావరిఖనిలోని భాస్కర్‌రావు భవన్‌లో నిర్వహించిన ఏఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఇప్పటివరకు జరిగిన ఏడు గుర్తింపు సంఘం ఎన్నికల్లో నాలుగు సార్లు ఏఐటియుసి విజయం సాధించిందని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఒప్పందాలు కుదుర్చుకుని హక్కుల సాధనలో కీలక పాత్ర పోషించిన చరిత్ర తమ సంఘానికి ఉందన్నారు. ఏడో గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఒక్క ఏరియాలో కూడా గెలవని హెచ్ఎంఎస్ యూనియన్‌కు చెందిన నాయకులు కార్మికుల హక్కులు, సంస్థ పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న ఏఐటియుసి నాయకులపై వ్యక్తిగత విమర్శలకు దిగడం తగదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంపీగా, ఎమ్మెల్సీగా కొనసాగిన కవిత, టిబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిగా పదేళ్లు ఉన్నప్పటికీ సింగరేణి కార్మికులకు లేదా సంస్థకు ఉపయోగపడే విధంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరుతో హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న కవిత వల్ల కూడా సింగరేణి కార్మికులకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ఏఐటియుసి అధికారంలో ఉన్నా లేకున్నా కార్మికుల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించి యాజమాన్యం, ప్రభుత్వాలను ఒప్పించి అనేక హక్కులు సాధించిన సంఘమని పేర్కొన్నారు. హెచ్ఎంఎస్ బాయి బాట కార్యక్రమం పేరుతో కవితను సింగరేణిలో తిప్పుతూ ఏఐటియుసిపై విమర్శలు చేయడం ద్వారా కార్మికులను తప్పుదోవ పట్టించలేరని, ఈ పరిణామాలను కార్మికులు నిశితంగా గమనిస్తున్నారని అన్నారు. ఇకనైనా రియాజ్ అహ్మద్ వ్యక్తిగత విమర్శలు మానుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో ఏఐటియుసి ఆర్జీ–1 బ్రాంచ్ ఆఫీస్ బేరర్ సిర్ర మల్లికార్జున్, నాయకులు ఎర్రగొల్ల చేరాలు, పడాల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యం

- సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**ప్రజానావ, వేములవాడ :** ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణ పరిధికి చెందిన 37 మంది లబ్ధిదారులకు రూ.13 లక్షల 57 వేల, వేములవాడ అర్బన్ మండల పరిధికి చెందిన 18 మంది లబ్ధిదారులకు రూ.5 లక్షల 66 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు పొందలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగంగా మారిందన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ ద్వారా వేగంగా ఆర్థిక సహాయం అందించడం వల్ల వారికి ఆర్థిక భారం తగ్గుతోందని పేర్కొన్నారు.

## ప్రతి విద్యార్థిలో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- 21వ శతాబ్దపు నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ఏఐ, ఐసీటీ ఆధారిత బోధనా విధానాలను సమర్థవంతంగా వినియోగించాలి



**ప్రజానావ, పెద్దపల్లి :** విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నాణ్యమైన విద్యాబోధన అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మూడురోజుల ఇంటిగ్రేటెడ్ ఇన్–సర్వీస్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. అంతర్గాం, పాలకుర్తి, శ్రీరాంపూర్, ఓదెల, పెద్దపల్లి మండలాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు తన బోధనా నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ ప్రతి విద్యార్థి నిర్దేశిత లెర్నింగ్ అవుట్‌కమ్స్ సాధించేలా కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా చదవడం (రీడింగ్), రాయడం (రైటింగ్), విమర్శనాత్మక ఆలోచన (క్రిటికల్ థింకింగ్), సమస్య పరిష్కార నైపుణ్యాలు (ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్), కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి 21వ శతాబ్దపు నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించేలా బోధన కొనసాగించాలని తెలిపారు. అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి రిమీడియల్ తరగతులు నిర్వహించడం ద్వారా అవసరమైన విద్యా సహాయాన్ని అందించాలని, ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టుల్లో అవసరమైన అభ్యసన సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత ప్రపంచంలో కృత్రిమ మేధస్సు (ఎఐ) వినియోగంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. భౌతిక శాస్త్ర బోధనలో ఏఐ టూల్స్‌ను ఉపయోగించి లెసన్ ప్లాన్లు రూపొందించడం, ప్రశ్నాపత్రాల తయారీ, బోధనను మరింత సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాలపై రిసోర్స్ పర్సన్లు శిక్షణ అందించారు. అదేవిధంగా ఐసీటీ ఆధారిత బోధనలో భాగంగా దీక్ష యాప్ వినియోగం, శిక్షా ఫౌండేషన్ రూపొందించిన శిక్ష కో–పైలట్ వేదికను విద్యాబోధనలో ఉపయోగించే విధానాన్ని వివరించారు. బొమ్మలు, ఆటల ఆధారిత సైన్స్ బోధన, తరగతి గదిలో పాఠ్యపుస్తకాన్ని సమర్థవం తంగా వినియోగించడం, అభ్యాస దీపికలు, ప్రభుత్వం అందించే వర్క్‌బుక్‌ల వినియోగం, ప్రయోగాత్మక బోధనలో ల్యాబొరేటరీ మాన్యువల్‌ను తప్పనిసరిగా ఉపయోగించాల్సిన అవసరాన్ని రిసోర్స్ పర్సన్లు వివరించారు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులతో కలెక్టర్ ప్రత్యక్షంగా ముచ్చటించి, శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. కృత్యాధారిత (యాక్టివిటీ బేస్డ్) బోధన ద్వారా విద్యార్థుల్లో అభ్యసన నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. గత సంవత్సరం నిర్వహించిన శిక్షణతో పోలిస్తే ఈ ఏడాది శిక్షణలో పొందుపరిచిన ముఖ్యాంశాలను మరోసారి పునశ్చరణ చేసుకుని, వాటిని తరగతి గదిలో అమలు చేసి విద్యార్థులను ఉత్తమ ప్రగతి దిశగా నడిపించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలలోని డిజిటల్ క్లాస్ రూమ్‌లు, ప్రీ ప్రైమరీ తరగతి గదులు, భోజన శాల తదితర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, రిసోర్స్ పర్సన్లు, శిక్షణ నిర్వాహకులు, అంతర్గాం, పాలకుర్తి, శ్రీరాంపూర్, ఓదెల, పెద్దపల్లి మండలాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నవజాత శిశువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

- గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలి
- బాలింతలకు నవజాత శిశువుల సంరక్షణపై అవగాహన కల్పించాలి
- నార్మల్ డెలివరీలు అయ్యేలా ప్రోత్సహించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సంకల్ప్‌పై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులతో కలెక్టర్ సమీక్ష



**ప్రజానావ, సిరిసిల్ల :** నవజాత శిశువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సంకల్ప్ లో భాగంగా నవజాత శిశువుల మరణాల నివారణ తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల గైనకాలజిస్టులు, చిన్న పిల్లల వైద్య నిపుణులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గత మూడు నెలల్లో నవజాత శిశువుల మరణాలు, కారణాలపై సుదీర్ఘ సమీక్ష చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వేములవాడ ఏరియా ఆస్పత్రిలో ఎస్ఎన్ సీ యూలో సేవలపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. నవ జాత శిశువుల మరణాల శాతం జాతీయ సగటు కంటే తక్కువగా ఉందని తెలిపారు. జిల్లాలో మరణాలు సున్న శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు క్రమం తప్పకుండా అన్ని ఆరోగ్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. అందరి వైద్య పరీక్షల వివరాలు భద్రపర్చాలని స్పష్టం చేశారు. గర్భిణులతో అవసరమైన వ్యాయామం. యోగా ఆసనాలు వేయించాలని, నార్మల్ డెలివరీ తో లాభాలు తెలియజేస్తూ ప్రోత్సహించాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నార్మల్ డెలివరీలు ఎక్కువ సంఖ్యలో అయ్యేలా చూడాలని ఆదేశించారు. హై రిస్క్ గర్భిణులకు మాత్రమే సీ సెక్షన్ ఆపరేషన్లు చేయాలని స్పష్టం చేశారు. బాలింతలు అప్పుడే పుట్టిన పిల్లలకు పాలు ఇవ్వడం, ఇతర జాగ్రత్తలపై వైద్యులు, సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే పుట్టిన బిడ్డను మొదటి గంటలోగా తల్లి వద్దకు చేర్చాలని తెలిపారు. నెలలు నిండని, తక్కువ బరువుతో పుట్టిన నవ జాత శిశువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, డీ సీ హెచ్ ఎస్ రవీందర్, మెడికల్ ఆఫీసర్లు, గైనకాలజిస్ట్, పిల్లల వైద్య నిపుణులు, ఐఎంఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ నిర్లక్ష్యంపై సిరిసిల్లలో వినూత్న నిరసన

**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్, అధికారుల బాధ్యత రాహిత్యానికి నిరసనగా బీజేపీ కౌన్సిలర్ వినూతన నిరసన చేపట్టారు. స్థానిక 7వ వార్డు కౌన్సిలర్ ఎర్రం వెంకట్రాజం తనను గెలిపించిన ప్రజల కోసం నాయకుడిగా కాకుండా సేవకుడిగా సేవ చేస్తున్న దృశ్యం ఆవిష్కరించారు. సిరిసిల్ల పురపాలక సంఘం శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్య వైఖరి నిరసనగా ఏడవ వార్డులో స్థానిక బీజేపీ కౌన్సిలర్ ఎర్రం వెంకట్రాజం డ్రైనేజీ క్లీన్ చేసి ప్రజలకు అసౌకర్యం లేకుండా చేశారు. దీనికి మున్సిపల్ సిబ్బంది భాద్యత వహించి సిరిసిల్ల పట్టణం లో శానిటేషన్ వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కౌన్సిలర్ ఎర్రం వెంకట్రాం డిమాండ్ చేస్తున్నారు.

## ఓటరు జాబితా సమగ్ర సవరణను గడువులోగా పూర్తి చేయాలి

**ఎస్ఐఆర్ - 2026 ప్రక్రియ పురోగతిపై అధికారులతో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమీక్ష**

**ప్రజానావ, బోధన్:** ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్–2026) ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బోధన్ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ డిజిటైజేషన్, మ్యాపింగ్ ప్రక్రియ ఎంత శాతం పూర్తయిందనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత గడువులోగా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తిచేసి ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేయాలని సూచించారు. మ్యాపింగ్ కాని ఓటర్లు, నివాసం మారిన వారు, మరణించిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా జాబితాను సవరించాలని ఆదేశించారు. ఓటరు జాబితా ఖచ్చితత్వంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలిం చాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ విజయకుమారి, బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ, బోధన్ నియోజకవర్గంలోని తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, డీఎల్‌పీఓ నాగరాజు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, వైద్యాధికారులు, సీడీపీఓ నందిని, ఎన్నికల సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో అప్రమత్తంగా వ్యవహరించాలి

- ఎస్పీ మహేష్ బీ. గితే



**ప్రజానావ, సిరిసిల్ల:** నేరాల నియంత్రణలో పోలీసు అధికారులు నిత్యం అప్రమత్తంగా వ్యవహరిస్తూ సమర్థవంతమైన పోలీసింగ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వేములవాడ సబ్ డివిజన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాంతిభద్రతలు, నేరాల నియంత్రణ, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, శాస్త్రీయ ఆధారాలతో పటిష్ఠమైన దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. సీసీటీఎన్ఎస్ 2.0, ఈ–సాక్ష్య, నాట్‌గ్రిడ్ వంటి సాంకేతిక వనరులను సమర్థంగా వినియోగించి కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. దొంగతనం కేసులను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని సీసీటీవీ ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాల సహాయంతో త్వరితగతిన ఛేదించి, దొంగిలించిన సొత్తును బాధితులకు అప్పగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ర్యాష్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, రవీందర్, మొగిలి, మధుకర్, ఆర్ఐలు మధుకర్, సురేష్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం అందించాలి

- సోనాల మండలంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమ అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచన



**ప్రజానావ, బోథ్:** సోనాల మండలం పార్డీ(బి) గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగది, భోజనశాల, తరగతి గదులను పరిశీలించిన ఆయన విద్యార్థులతో నేరుగా మాట్లాడి మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలోని బోర్ నీటి నాణ్యతను టీడీఎస్ పరికరంతో పరీక్షించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న **ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ)** కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ పరీక్షలు నిర్వహించి వారి పఠన సామర్థ్యం, రీడింగ్ నైపుణ్యాలను స్వయంగా పరిశీలించి విద్యార్థులతో సమాధానాలు రాబట్టారు. ఈ తనిఖీలో ఎమ్మార్వో మల్లేష్, ఎంపీడీవో రత్నాకర్, ఉపాధ్యాయులు రాజన్న, శేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శాఖాంబరి ఉత్సవాల ప్రారంభం

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ డా. కడియం కావ్య



**ప్రజానావ, వరంగల్:** వరంగల్‌లోని శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శాఖాంబరి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించి శ్రీ మహాగణపతి, శ్రీ ఆంజనేయస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అధికారికంగా జ్యోతి ప్రజ్వలన చేసి శాఖాంబరి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న ఈ పవిత్ర సంప్రదాయంలో ఈసారి శాఖాంబరి ఉత్సవాలను ప్రారంభించే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి అమ్మవారి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో మామునూరు విమానాశ్రయం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాకతీయ టెక్స్‌టైల్ పార్క్, అండర్‌డ్రైనేజ్ వంటి కీలక అభివృద్ధి పనులు వేగంగా పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత, ఆలయ ప్రధాన అర్చకులు శేషు, నాయకులు ఆంజనేయులు, పూర్ణ, సతీష్, వీరన్నతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# హర్మూజ్ సురక్షితంగా దాటాం

- భార్యకు సందేశం పంపిన కొద్దిసేపటికే పుణేకు చెందిన మెరైన్ ఇంజినీర్ మృతి
- ఒమన్ తీరంలో జీఎఫ్ఎస్ గెలాక్సీ కంటైనర్ నౌకపై దాడి
- ఒమన్ నేవీ స్వాధీనంలో మృతదేహం
- మృతదేహం కోసం కుటుంబ సభ్యులు, బంధువుల ఎదురుచూపు



**పుణే:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఒమన్ తీరంలో దాడికి గురైన సైప్రస్ జెండాతో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలో విధులు నిర్వహిస్తు న్న పుణేకు చెందిన మెరైన్ ఇంజినీర్ హేరంభ్ కర్మార్కర్ (30) మృతి చెందడం విషాదాన్ని మిగిల్చింది. దాడికి కొద్దిసేపటి ముందు భార్యకు పంపిన సందేశమే ఆయన నుంచి వచ్చిన చివరి సమాచారం కావడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయన మృతదే హం స్వదేశానికి చేరుకోవాలని కుటుంబం ఎదురు చూస్తోంది. భారత కాలమానం ప్రకారం తెల్లవారు జామున 2.49 గంటలకు హేరంభ్ తన భార్యకు పంపిన సందేశంలో, అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని తమ నౌక సురక్షితంగా దాటిందని పేర్కొన్నారు. అయితే ఆ సందేశం పంపిన కొద్దిసేప టికే నౌకపై దాడి జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున ఇరాన్, ఒమన్‌ల మధ్య ఉన్న హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న జీఎఫ్ఎస్ గెలాక్సీ కంటైనర్ నౌకపై దాడి జరిగింది. ఈ ఘటనలో హేరంభ్ ప్రాణాలు కోల్పోగా, ఆయన మృతదేహాన్ని ఒమన్ నేవీ స్వాధీనం చేసుకుంది. అవసరమైన ప్రక్రియలు పూర్తయిన అనంతరం మృతదేహాన్ని త్వరలోనే భారత్‌కు తరలిస్తారని కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఐదు నెలలుగా అదే నౌకలో విధులు

హేరంభ్ గత ఐదు నెలలుగా అదే నౌకలో మెరైన్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నారని ఆయన మామ వివేక్ టాండన్ తెలిపారు. బ్రిటన్‌లోని సిటీ ఆఫ్ గ్లాస్గో కాలేజ్‌లో మెరైన్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన హేరంభ్, అనంతరం మర్చంట్ నేవీలో చేరి పలు అంతర్జాతీయ నౌకల్లో సేవలందిస్తున్నట్లు వివరించా రు. హేరంభ్‌కు భార్య, తల్లి, చెల్లెలు ఉన్నారు. తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులు ప్రస్తుతం ఈ ఘటనపై మరిన్ని వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. ఆయన మృతదేహం స్వదేశానికి చేరుకోవాలని కుటుంబ సభ్యులు, బంధువులు ఎదురు చూస్తున్నారు.

# మోదీ నివాసంలో బీజేపీ అగ్రనేతల కీలక భేటీ

- అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్, బీఎల్ సంతోష్ హాజరు
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు వ్యూహాలపై చర్చ?
- కేంద్ర మంత్రివర్గం, పార్టీ పదవుల్లో మార్పుల ఊహాగానాల మధ్య సమావేశం

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు బీజేపీ అగ్రనేతలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసంలో బుధవారం కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) బీఎల్ సంతోష్ పాల్గొన్నారు. సమావేశంలో ఏ అంశాలపై చర్చించారనే విషయా న్ని అధికారికంగా వెల్లడించకపోయినా, వచ్చే వారం ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల వ్యూహం, రాజకీయ పరిణామాలు, పార్టీ వ్యవహారా లపై చర్చ జరిగినట్లు రాజకీయ వర్గాలు భావిస్తు న్నాయి. బీజేపీ జాతీయ పదాధికారుల బృందంలో మార్పులు, కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశాలపై ఊహాగానాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

# అవసరమైతే టీఎంసీని మళ్లీ నిర్మిస్తా

- ఎంతమంది బయటకు వెళ్లినా పార్టీ బలహీనపడదు
- ప్రజల విశ్వాసం, కార్యకర్తల అండతో మరింత బలోపేతం చేస్తాం
- రాజీ రాజకీయాలకు తలవంచకుండా అభిషేక్ పోరాటం
- అందుకే అతడిపై కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా ఒత్తిడి తెచ్చే యత్నం
- ద్రోహుల తరఫున ప్రజలకు క్షమాపణలు చెబుతున్నా
- మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమత బెనర్జీ
- కీలక నేతల రాజీనామాల మధ్య మేనల్లుడికి అండ



**కోల్‌కతా:** పార్టీ నుంచి ఎంతమంది వెళ్లినా టీఎంసీ బలహీనపడదు మమత ధీమా వ్యక్తం చేశారు. అవసరమైతే పార్టీని మళ్లీ మొదటి నుంచి నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నా. ప్రజల విశ్వాసం, కార్యకర్తల అండతో టీఎంసీని మరింత బలోపేతం చేస్తామని మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమత బెనర్జీ పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో వరుస తిరుగుబాట్లు, కీలక నేతల రాజీనామాల మధ్య పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ పూర్తి మద్దతు ప్రకటించారు. అభిషేక్ వ్యవహారశైలే నేతలు పార్టీని వీడటానికి కారణమన్న ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. రాజీ రాజకీయాలకు తలవం చకుండా పోరాడుతున్నందుకే ఆయనను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఫేస్‌బుక్ లైవ్ ద్వారా పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడిన మమత.. అభిషేక్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఆయన కుటుంబ సభ్యులకు కూడా సమన్లు జారీ చేశారని గుర్తుచేశారు. రాజీపడితే వ్యక్తిగ తంగా ఉపశమనం పొందే అవకాశం ఉన్నప్పటికీ, అభిషేక్ పోరాటం నుంచి వెనక్కి తగ్గలేదని కొనియాడారు. ఆయన చేసిన రాజకీయ పోరాటంతో గతంలో పార్టీపై ఏర్పడిన ప్రతికూలతలను ప్రజలు అధిగమించారని వ్యాఖ్యానించారు. ఇటీవలి కాలంలో టీఎంసీని వీడిన నేతలపై మమత తీవ్ర విమర్శలు గుప్పించారు. ద్రోహుల తరఫున ప్రజలకు నేను క్షమాపణలు చెబుతున్నాను. రాజకీయ ప్రయోజనాల కోసం నా మనస్సాక్షిని ఎప్పుడూ అమ్ముకోలేదు అని స్పష్టం చేశారు.

### ఒత్తిళ్ల కారణంగానే బీజేపీలోకి..

కేంద్ర దర్యాప్తు సంస్థలు, పోలీసు వ్యవస్థను ఉపయో గించి బీజేపీ టీఎంసీ నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆమె ఆరోపించారు. ఆ ఒత్తిళ్ల కారణంగానే కొందరు ఎంపీలు, నేతలు బీజేపీలో చేరుతున్నారని అన్నారు. ప్రస్తుతం టీఎంసీకి లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి 18 మంది ఎంపీలు ఉన్నారని తెలిపారు. పార్టీని వీడుతున్న నాయకులు బీజేపీ వాషింగ్ మెషీన్‌లో చేరుతున్నారని మమత ఎద్దేవా చేశారు. ఇటీవల టీఎంసీకి రాజీనామా చేసిన మదన్ మిత్రా తన కుటుంబ సభ్యులకు సమన్లు వచ్చాయని ముందుగానే చెప్పారని, అప్పుడే ఆయన పార్టీ మారే అవకాశాన్ని తాము గుర్తించామని వెల్లడించారు. దర్యాప్తు సంస్థల కేసుల నుంచి బయటపడేందుకే కొందరు రాజకీయ సౌలభ్యాన్ని ఆశ్రయిస్తున్నారని విమర్శించారు.

# అమెరికా వీసాల పేరుతో మోసం.. ఈడీ చార్జిషీట్

- ఖాతాల్లో తాత్కాలికంగా రూ.40 లక్షలు జమ చేసి నకిలీ ఆర్థిక సామర్థ్యం సృష్టి
- 154 మందికి నకిలీ నిధుల ఆధారాలు
- ఇమ్మిగ్రేషన్ సంస్థలపై కేసు

**న్యూఢిల్లీ:** అమెరికా వీసాల కోసం దరఖాస్తు చేసిన వారి బ్యాంకు ఖాతాల్లో తాత్కాలికంగా రూ.40 లక్షలు జమ చేసి, వెంటనే ఉపసంహరించుకుని నకిలీ ఆర్థిక సామర్థ్యం ఉన్నట్లు చూపించిన సంఘ టిత మోసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చార్జిషీట్ దాఖలు చేసింది. అమెరికా రాయబార కార్యాలయం ఫిర్యాదు ఆధారంగా నమోదైన కేసులో జలంధర్‌లోని ప్రత్యేక పీఎంఎల్‌ఏ కోర్టులో ఈ చార్జిషీట్‌ను సమర్పించింది. దర్యాప్తులో భాగం గా 154 మంది వీసా దరఖాస్తుదారుల ఖాతాల్లో సుమారు రూ.40 లక్షలు కొద్దిసేపు జమ చేసి తిరిగి తీసేసినట్లు ఈడీ గుర్తించింది. ఇందుకోసం ఒక్కో దరఖాస్తుదారుని నుంచి సుమారు రూ.40 వేల చొప్పున వసూలు చేసినట్లు తెలిపింది. విద్యా, ఉద్యోగ అనుభవ ధ్రువపత్రాలు, ఆర్థిక పత్రాలు కూడా నకిలీగా రూపొందించినట్లు ఆరోపిస్తూ రెడ్ లీఫ్ ఇమ్మిగ్రేషన్, రుద్ర కన్సల్టెన్సీ సర్వీసెస్ తదితర సంస్థలు, వాటి నిర్వాహకులపై చార్జిషీట్ దాఖలు చేసింది. ఢిల్లీ, పంజాబ్, హర్యానాల్లో నిర్వహించిన సోదాల్లో కీలక ఆధారాలు, ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ వెల్లడించింది.

# బద్రీనాథ్ ఆలయంలో కలకలం

- విరాళాల రిజిస్టర్‌లో అక్రమాలు గుర్తించిన అధికారులు
- ఆలయ ఖజాంచీ బదిలీ.. సీఎం ఆదేశాలతో విచారణ వేగవంతం
- సీసీటీవీ ఫుటేజీలు, హుండీ లెక్కింపు విధానంపై దర్యాప్తు



**డెహ్రాడూన్:** బద్రీనాథ్ ఆలయంలో భక్తుల విరాళాల నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఆలయ ఖజాంచీ (ట్రెజరర్) సందేశ్ మెహతాను విధుల నుంచి తొలగించి బదిలీ చేశారు. విరాళాల రిజిస్టర్‌లో ఓవర్‌రైటింగ్ (మార్పులు), ఆలయ లాకర్‌లో ఉన్న వెండి పరిమాణం రికార్డులతో సరిపోకపోవడం ఈ చర్యకు కారణమని అధికారులు తెలిపారు. శ్రీ బద్రీనాథ్–కేదార్‌నాథ్ ఆలయ కమిటీ (బీకేటీసీ) ముఖ్య కార్యనిర్వహణాధికారి సోహన్ సింగ్ రంగాద్ మాట్లాడుతూ.. ఖజాంచీ బాధ్యతలను ఇంతవరకు పూజా కౌంటర్‌లో పనిచేస్తున్న కేదార్ సింగ్‌కు అప్పగించినట్లు తెలిపారు. సందేశ్ మెహతాను కేదార్ సింగ్ పనిచేసిన స్థానానికి బదిలీ చేసినట్లు వెల్లడించారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ ఆదేశాల మేరకు గఢ్వాల్ కమిషనర్ ఆనంద్ స్వరూప్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన విచారణ కమిటీ రెండో రోజు కూడా దర్యాప్తు కొనసాగించింది. ఆలయంలో విరాళాల స్వీకరణ, హుండీ నుంచి నగదును లెక్కింపు కేంద్రానికి తరలించే విధానం, సిబ్బంది పనితీరుపై వివరాలు సేకరించింది. విచారణ కమిటీ ఆలయ ప్రాంగణం లోని సీసీటీవీ కెమెరాలు, నగదు లెక్కింపు గది, లెక్కల రిజిస్టర్లు, ఇతర పత్రాలను పరిశీలించింది. అందుబా టులో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను కూడా పరిశీలిస్తు న్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అవసరమైతే సాంకేతిక నిపుణుల అభిప్రాయాన్ని కూడా తీసుకోనున్నట్లు వెల్లడించారు.

### సోషల్ మీడియాలో ఆరోపణలతో వెలుగులోకి

జూలై 2న సోషల్ మీడియాలో ఆలయ విరాళాల నిర్వ హణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెలువ డడంతో బీకేటీసీ నాలుగు సభ్యులతో అంతర్గత విచా రణ కమిటీని ఏర్పాటు చేసింది. ప్రాథమిక విచారణలో ఆరోపణలకు ఆధారాలు ఉన్నట్లు తేలడంతో ఉద్యోగి ప్రమోద్ నౌటియాల్‌ను జూలై 7న సస్పెండ్ చేశారు. అనంతరం బీకేటీసీ ఫిర్యాదుతో బద్రీనాథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటీ)ను ఏర్పాటు చేశారు. ఎస్ఐటీ సేకరించిన ఆధారాల ఆధారంగా జూలై 12 రాత్రి ప్రమోద్ నౌటియాల్‌ను అరెస్టు చేసింది. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది.



# ఆరు నెలల గడువిస్తే.. ఒకే దేశం-ఒకే ఎన్నికలకు సిద్ధం

- సంయుక్త పార్లమెంటరీ కమిటీకి ఎన్నికల సంఘం ప్రాథమిక నివేదిక
- 2028లో చట్టం వస్తే.. 2029లో ఒకేసారి ఎన్నికలు నిర్వహించొచ్చని స్పష్టం
- ప్రజలు, నిపుణుల నుంచి విస్తృత మద్దతు లభించిందన్న జేపీసీ చైర్మన్

**లక్నో:** ఒకే దేశం–ఒకే ఎన్నికలు (వన్ నేషన్ వన్ ఎలక్షన్) ప్రతిపాదన అమలుకు ఆరు నెలల ముందస్తు గడువు ఇస్తే లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎన్నికల సంఘం (ఈసీ) సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి ప్రాథమికంగా తెలిపిందని కమిటీ చైర్మన్ పీపీ చౌదరి వెల్లడించారు. మూడు రోజులపాటు విద్యావేత్తలు, నిపుణులతో సంప్రదింపులు ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2028లో పార్లమెంట్ ఈ చట్టాన్ని ఆమోదిస్తే, 2029 నుంచి ఒకేసారి ఎన్నికలు నిర్వహించవచ్చని ఎన్నికల సంఘం అభిప్రాయపడిం దన్నారు. తుది సిఫార్సులు చేసే ముందు ఎన్నికల సంఘాన్ని కమిటీ మరోసారి ఆహ్వానించి, ఎన్నికల నిర్వహణ విధానం, సాధ్యాసాధ్యాలపై వివరాలు తెలుసుకుంటామని చౌదరి తెలిపారు.

### రాజ్యాంగానికి విరుద్ధం కాదన్న నిపుణులు

ఈ ప్రతిపాదన రాజ్యాంగ మౌలిక స్వరూపానికి, సమాఖ్య వ్యవస్థకు లేదా ప్రజాస్వామ్యానికి విరుద్ధం కాదని రాజ్యాంగ నిపుణులు కమిటీకి వివరించారని ఆయన చెప్పారు. తరచూ ఎన్నికలు జరగడం వల్ల పాలనపై ప్రభావం పడుతోందని, అధికారులు ఎన్నికల విధుల్లోనే నిమగ్నమవుతున్నారని పలు వర్గాలు కమిటీ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. జేపీసీ ఉత్తరప్రదేశ్‌లోని పలు విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, న్యాయ నిపుణులు, పౌరసంఘాలు, మీడియా ప్రతినిధులతో సమావేశమై అభిప్రాయాలు సేకరించింది.

# ఫ్రాన్స్‌లో అసిస్టెడ్ డైయింగ్‌కు గ్రీన్ సిగ్నల్

- ప్రాణాంతక, నయంకాని వ్యాధులతో బాధపడుతున్న వారికి కఠిన నిబంధనలతో అనుమతి
- జాతీయ అసెంబ్లీలో చారిత్రక బిల్లుకు ఆమోదం

**పారిస్:** ఫ్రాన్స్‌లో నయంకాని, ప్రాణాంతక వ్యాధుల తో తీవ్ర వేదన అనుభవిస్తున్న రోగులకు కఠిన నిబంధనలతో అసిస్టెడ్ డైయింగ్ (ఇష్టమరణం)కు అనుమతి కల్పించే చారిత్రక బిల్లుకు జాతీయ అసెంబ్లీ తుది ఆమోదం తెలిపింది. దిగువ సభలో బిల్లుకు అనుకూలంగా 291 మంది, వ్యతిరేకంగా 241 మంది సభ్యులు ఓటు వేయడంతో పార్లమెంటు ఆమోద ప్రక్రియ పూర్తయింది. సెనేట్ మూడుసార్లు బిల్లును తిరస్కరించినప్పటికీ, రెండు సభల మధ్య విభేదాలు తలెత్తినప్పుడు తుది నిర్ణయం జాతీయ అసెంబ్లీదే కావడంతో బిల్లు ఆమోదం పొందింది. కొత్త చట్టం ప్రకారం 18 ఏళ్లు పైబడిన ఫ్రెంచ్ పౌరులు లేదా చట్టబద్ధ నివాసితులు మాత్రమే ఇష్టమరణానికి అర్హులు. వారు నయంకాని, ప్రాణాంతక వ్యాధి చివరి దశలో ఉండి, చికిత్సతో తగ్గని తీవ్రమైన శారీరక లేదా మానసిక వేదనను అనుభవిస్తున్నట్లు వైద్యపరంగా నిర్ధారణ కావాలి. అయితే కేవలం మానసిక వేదన ఆధారంగా ఈ హక్కు వర్తించదు. అల్జీమర్స్ వంటి న్యూరోడిజెనరేటివ్ వ్యాధులు లేదా తీవ్రమైన మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారికి ఈ చట్టం వర్తించదని స్పష్టం చేశారు. ఇష్టమరణం కోసం రోగి స్వయంగా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. అనంతరం వైద్య నిపుణుల బృందం 15 రోజుల్లో దరఖాస్తును పరిశీ లించి నిర్ణయం తీసుకుంటుంది. ఆ తర్వాత రెండు రోజుల ఆలోచనా గడువు ఇచ్చి, తన నిర్ణయాన్ని రోగి మరోసారి ధృవీకరించాల్సి ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో ప్రాణాంతక ఔషధాన్ని రోగి స్వయంగా తీసుకోవాలి. శారీరక పరిస్థితి అనుమతించనప్పుడు మాత్రమే వైద్యుడు లేదా నర్సు సహాయం అందించేందుకు అవకాశం ఉంటుంది. ఇందుకు అయ్యే ఖర్చును ఫ్రాన్స్ జాతీయ ఆరోగ్య బీమా వ్యవస్థ భరిస్తుంది.

### స్వాగతించిన రైట్ టు డై విత్ డిగ్నిటీ

ఈ నిర్ణయాన్ని రైట్ టు డై విత్ డిగ్నిటీ సంస్థ స్వాగతించింది. భరించలేని బాధను గౌరవప్రదంగా ముగించుకునే హక్కును ప్రజలకు కల్పించడం మానవీయ నిర్ణయమని పేర్కొంది. అయితే వృద్ధులు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నవారిపై పరోక్ష ఒత్తిళ్లు పెరిగే అవకాశం ఉందని వ్యతిరేక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే ఈ బిల్లు వెంటనే అమల్లోకి రానుంది కాదు. ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకోర్ను బిల్లులోని కొన్ని నిబంధనలను రాజ్యాంగ మండలి పరిశీలనకు పంపించారు.

# అగ్నికుల్‌లోకి మాజీ ఇస్రో చైర్మన్ సోమనాథ్

- చెన్నై స్పేస్ స్టార్టప్ బోర్డు పరిశీలకుడిగా నియామకం
- మిషన్-02కు సాంకేతిక మార్గనిర్దేశం
- పునర్వినియోగ రాకెట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



**న్యూఢిల్లీ:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్ ప్రైవేట్ అంతరిక్ష రంగంలో కీలక అడుగు వేశారు. చెన్నై కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న అంతరిక్ష స్టార్టప్ అగ్నికుల్ కాస్మోస్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో పరిశీలకుడిగా (అబ్జర్వర్) ఆయన నియమితులయ్యా రు. ఈ విషయాన్ని సంస్థ అధికారికంగా ప్రకటించిం ది. 2025 జనవరి వరకు ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన సోమనాథ్ నాయకత్వంలో భారత్ చంద్రయాన్–3 మిషన్‌తో చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. అలాగే దేశ తొలి సౌర పరిశీలన ఉపగ్రహం ఆదిత్య–ఎల్1 విజయవంతమైన ప్రయోగం కూడా ఆయన హయాంలోనే జరిగింది. అగ్నికుల్ కాస్మోస్ చేపట్టను న్న ప్రతిష్ఠాత్మక మిషన్–02కు ముందు సోమనాథ్ సంస్థలో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ మిషన్‌లో కక్ష్య స్థాయి రాకెట్ బూస్టర్‌ను ప్రయోగం అనంతరం సురక్షితంగా తిరిగి స్వాధీనం చేసుకోవ డంతో పాటు, రాకెట్ ఎగువ దశను అంతరిక్షంలోనే బహుళ ప్రయోజనాల వేదికగా వినియోగించే సాంకేతికతను పరీక్షించనున్నారు.

### ప్రపంచ అంతరిక్ష రంగానికి కీలక ముందడుగు

మిషన్–02 భారత్‌కే కాకుండా ప్రపంచ అంతరిక్ష రంగానికీ సాంకేతికంగా కీలకమైన ప్రయోగమని సోమనాథ్ పేర్కొన్నారు. స్వదేశీ సెమీ–క్రయోజెనిక్ ప్రొపల్షన్ వ్యవస్థ, కొద్ది రోజుల్లో తయారయ్యే 3డీ ప్రింటెడ్ రాకెట్ ఇంజిన్, వినూత్న ఎగువ దశ రూపకల్పన వంటి సాంకేతిక అంశాలు ఈ మిషన్‌ను ప్రత్యేకంగా నిలబెడతాయని చెప్పారు. ఈ వినూత్న ప్రయాణంలో అగ్నికుల్ బృందానికి తన వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. మిషన్–02లో రెండు దశల అగ్నిబాణ్ రాకెట్‌ను ప్రయోగించనున్నారు. తొలి దశ బూస్టర్‌ను విడిపోయిన అనంతరం నియంత్రిత పద్ధతిలో సము ద్రంలోకి దింపి తిరిగి రికవరీ చేసే సాంకేతికతను పరీక్షించనున్నారు. రెండో దశ మాత్రం పేలోడ్‌ను కక్ష్యలో ప్రవేశపెట్టిన తర్వాత అంతరిక్షంలోనే పనిచేసే ప్రత్యేక వేదికగా మారి తన సామర్థ్యాన్ని నిరూపించనుంది. ఈ ప్రయోగం విజయవంతమైతే తక్కువ వ్యయంతో పునర్వినియోగ అంతరిక్ష వ్యవస్థల అభివృద్ధికి కీలక అడుగుగా నిలవనుంది.

### సోమనాథ్ అనుభవం సంస్థకు బలం

సోమనాథ్ వంటి అనుభవజ్ఞుడు బోర్డులో చేరడం తమ సంస్థకు గొప్ప బలమని అగ్నికుల్ కాస్మోస్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీనాథ్ రవిచంద్రన్ తెలిపా రు. రాకెట్ రూపకల్పన, బూస్టర్ రికవరీ, కక్ష్య కార్యక లాపాల నిర్వహణలో ఆయనకు ఉన్న అపార అను భవం మిషన్–02తో పాటు భవిష్యత్ ప్రాజెక్టుల విజ యానికి దోహదపడుతుందని చెప్పారు. సోమనాథ్ చేరిక సాధారణ నియామకం కాదని, భారత ప్రైవేట్ అంతరిక్ష రంగానికి ఇది కీలకమైన భాగస్వామ్యమని ఆయన పేర్కొన్నారు.

# లిబియా తీరంలో వలసదారుల పడవ బోల్తా

- 50 మంది గల్లంతు.. 10 మంది సురక్షితం
- గల్లంతైన వారి కోసం గాలింపు

**కైరో:** యూరప్‌కు అక్రమంగా వెళ్తున్న వలసదారు లతో కూడిన ఓ పడవ లిబియా తూర్పు తీరంలో బోల్తాపడటంతో కనీసం 50 మంది మృతి చెందగా లేదా గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. మహిళలు, చిన్నారులతో కలిపి సుమారు 60 మంది ప్రయా ణిస్తున్న ఈ పడవ మంగళవారం టోబ్రుక్ సమీపం లోని బర్దా దీవి వద్ద ప్రమాదానికి గురైంది. 10 మంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు ప్రమాదం సమయంలో 10 మంది ఈదుకుంటూ సమీప దీవికి చేరుకుని ప్రాణాలు దక్కించుకున్నా రని, మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగు తున్నాయని లిబియా కోస్ట్‌గార్డ్ వెల్లడించింది. ఆఫ్రికా, మధ్యప్రా చ్య దేశాల నుంచి మెరుగైన జీవితం కోసం యూర ప్‌కు వెళ్లే వలసదారులకు లిబియా ప్రధాన మార్గంగా మారింది. అక్రమ రవాణాదారులు చిన్న, సురక్షితం కాని పడవల్లో వారిని తరలిస్తుండటంతో తరచూ ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటు న్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి మే మధ్య మధ్యధరా సముద్ర మార్గంలో 800 మందికిపైగా వలసదారులు మృతి చెందగా లేదా గల్లంతైనట్లు అంతర్జాతీయ వలస సంస్థ (ఐఓఎం) తెలిపింది.

# విధుల్లోనే ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ మృతి

- సింఘు సరిహద్దు వద్ద వేగంగా దూసుకొచ్చిన ఢీకొట్టిన కారు
- వాహనాన్ని గుర్తించిన పోలీసులు.. పరారీలో డ్రైవర్

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో విధులు నిర్వహిస్తు న్న ట్రాఫిక్ పోలీసు హెడ్ కానిస్టేబుల్ రోడ్డు ప్రమా దంలో ప్రాణాలు కోల్పోయారు. సింఘు సరిహద్దు వద్ద ట్రాఫిక్‌ను నియంత్రిస్తుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఆయన ఆసుపత్రి లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు గుర్తించగా, పరారీలో ఉన్న డ్రైవర్ కోసం ప్రత్యేక బృందాలతో విస్తృతంగా గాలిస్తున్నారు. అలీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. సింఘు సరిహద్దు వద్ద విధుల్లో ఉన్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ అమిత్ వాహనాల రాకపోకలను నియంత్రిస్తుండగా, అత్యంత వేగంతో వచ్చిన ఓ కారు ఆయనను బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ వాహనాన్ని ఆప కుండా అక్కడి నుంచి పరారయ్యాడు. సహచర పోలీ సులు వెంటనే స్పందించి తీవ్రంగా గాయపడిన అమిత్‌ను నరేలాలోని సత్యవాది రాజా హరిశ్ చంద్ర ఆసుపత్రికి తరలించా రు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడు హర్యానాలోని సోనీపట్‌కు చెందినవారని తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారును ఇప్పటికే గుర్తించినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. పరారీలో ఉన్న డ్రైవర్‌ను పట్టుకునేందు కు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# అమెరికా కంటే చైనాకే ప్రపంచ మద్దతు!

- 36 దేశాల్లో 25 దేశాల ప్రజలు చైనాపై సానుకూల అభిప్రాయం
- ప్యూ రీసెర్చ్ సెంటర్ తాజా సర్వే వెల్లడి

**వాషింగ్టన్:** ప్రపంచవ్యాప్తంగా అమెరికా కంటే చైనాపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఎక్కువగా ఉందని ప్యూ రీసెర్చ్ సెంటర్ తాజా సర్వే వెల్లడించింది. 36 దేశాలు, ప్రాంతాల్లో నిర్వహించిన సర్వేలో 25 దేశాల ప్రజలు అమెరికా కంటే చైనాను మెరుగ్గా అభిప్రాయపడ్డారు. కేవలం ఆరు దేశాల్లో మాత్రమే అమెరికాపై సానుకూల అభిప్రాయం కొనసాగింది. సర్వేలో పాల్గొన్న 36 దేశాల్లో 22 దేశాల ప్రజలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కంటే చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌పై ఎక్కువ విశ్వాసం వ్యక్తం చేశారు. కెనడా, మెక్సికోతో పాటు ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ వంటి యూరోపియన్ దేశాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపించింది.

### 20 ఏళ్లలో తొలిసారి

దాదాపు రెండు దశాబ్దాలుగా ఈ తరహా సర్వేలు నిర్వహిస్తున్న ప్యూ సంస్థ చరిత్రలో అమెరికాను అధిగమించి చైనా ముందంజలో నిలవడం ఇదే తొలిసారి. ట్రంప్ ప్రభుత్వం మిత్రదేశాలతో విభేదా లు, సుంకాల విధానం, అంతర్జాతీయ వ్యవహారాల నిర్వహణపై అసంతృప్తి కారణంగా అమెరికా ప్రతిష్ఠ దెబ్బతిన్నట్లు పరిశోధకులు పేర్కొన్నారు. వ్యక్తిగత స్వేచ్ఛలను గౌరవించే విషయంలో ఇప్పటికీ అమెరి కానే చైనా కంటే మెరుగ్గా ఉందని ప్రజలు భావిస్తున్న ప్పటికీ, ఈ రెండు దేశాల మధ్య అంతరం గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గినట్లు సర్వే పేర్కొంది.

# ఆగస్టు 15 వరకు ఎర్రకోట మూసివేత

- స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్ల నేపథ్యంలో ప్రజలకు ప్రవేశం నిలిపివేత
- ప్రతి ఏడాదిలాగే ఏఎస్ఐ ఉత్తర్వులు జారీ

**న్యూఢిల్లీ:** దేశ రాజధానిలోని చారిత్రక ఎర్రకోట (రెడ్ ఫోర్ట్)ను జూలై 15 నుంచి ఆగస్టు 15న జరిగే 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ముగిసే వరకు ప్రజలకు మూసివేశారు. స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్ల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారత పురావస్తు సర్వే (ఏఎస్ఐ) వెల్లడించింది. ప్రాచీన స్మారక చిహ్నాలు, పురావస్తు ప్రదేశాల పరిరక్షణ నిబంధనల మేరకు జూలై 9న ఉత్తర్వులు జారీ చేసిన ఏఎస్ఐ.. జూలై 15 నుంచి ఆగస్టు 15న స్వాతంత్ర్య వేడుకలు పూర్తయ్యే వరకు ఎర్రకోటలో సాధారణ సందర్శకులకు ప్రవేశం ఉండదని స్పష్టం చేసింది. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు ప్రతి ఏడాది ఇలాంటి ఉత్తర్వులు జారీ చేయడం ఆనవాయితీ అని ఏఎస్ఐ సీనియర్ అధికారి తెలిపారు. భద్రతా ఏర్పాట్లు, వేదిక నిర్మాణం, ఇతర ఏర్పాట్ల కోసం ఈ కాలంలో ఎర్రకోటను పూర్తిగా భద్రతా బలగాల ఆధీనంలో ఉంచుతారు. యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన ఎర్రకోటలో 1947 ఆగస్టు 15 నుంచి ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 15న ప్రభుత్వం జారీ చేసిన ప్రత్యేక పాస్‌లు కలిగిన వారికే ఎర్రకోట ప్రాంగణంలోకి ప్రవేశానికి అనుమతి ఉంటుంది.





# మెస్సీ మ్యాజిక్..

- ఫైనల్‌లోకి అర్జెంటీనా.. ఇంగ్లండ్‌పై 2–1తో ఉత్కంఠ విజయం
- చివరి క్షణాల్లో రెండు గోల్స్ చేసిన డిఫెండిగ్ చాంపియన్
- ఆదివారం స్పెయిన్‌తో తుది పోరు

**అట్లాంటా:** ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ మరోసారి తన మ్యాజిక్‌ను ప్రదర్శించాడు. చివరి నిమిషాల్లో రెండు గోల్స్‌కు అసిస్టులు అందించి డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాను ప్రపంచకప్ ఫైనల్‌కు చేర్చాడు. బుధవారం జరిగిన రెండో సెమీఫైనల్లో అర్జెంటీనా 2–1తో ఇంగ్లండ్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. 55వ నిమిషంలో ఆంథోనీ గోర్డన్ గోల్‌తో ఇంగ్లండ్ ఆధిక్యంలోకి వెళ్లింది. మ్యాచ్ ముగిసే ఐదు నిమిషాల ముందు వరకు అదే స్కోరు కొనసాగింది. అయితే 85వ నిమిషంలో మెస్సీ అందించిన పాస్‌ను ఎంజో ఫెర్నాండెజ్ గోల్‌గా మలిచి స్కోరును 1–1తో సమం చేశాడు. అనంతరం ఇంజురీ టైమ్‌లో మెస్సీ ఇచ్చిన అద్భుత క్రాస్‌ను లౌటారో మార్టినెజ్ హెడ్డర్‌తో గోల్‌గా మార్చి అర్జెంటీనాకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఈ విజయంతో అర్జెంటీనా ఆదివారం న్యూజెర్సీలో జరిగే ఫైనల్లో స్పెయిన్‌తో తలపడనుంది. ఫైనల్‌లో విజయం సాధిస్తే 1958, 1962లో బ్రెజిల్ తర్వాత వరుసగా రెండు ప్రపంచకప్‌లు గెలిచిన తొలి జట్టుగా అర్జెంటీనా చరిత్ర సృష్టించనుంది.



# సైకియాకు కీలక బాధ్యతలు

- ఐసీసీ గవర్నెన్స్ రివ్యూ కమిటీ చైర్మన్‌గా నియామకం
- ఫ్రాంచైజీ లీగ్స్ కమిటీలోనూ సభ్యత్వం

**ఎడిన్‌బర్గ్:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి దేవజిత్ సైకియాకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కీలక బాధ్యతలు అప్పగించింది. ఐసీసీ కొత్తగా ఏర్పాటు చేసిన గవర్నెన్స్ రివ్యూ కమిటీకి ఆయనను చైర్మన్‌గా నియమించింది. ఐసీసీ వార్షిక సమావేశాల సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. గవర్నెన్స్ రివ్యూ కమిటీలో క్రికెట్ దక్షిణాఫ్రికాకు చెందిన డాక్టర్ మహ్మద్ మూసాజీ, ఐసీసీ స్వతంత్ర డైరెక్టర్ డాక్టర్ రాస్ రివాజ్ సభ్యులుగా వ్యవహరించనున్నారు. ఐసీసీ పాలనా విధానాలు, నిబంధనల అమలు, సంస్థాగత సంస్కరణలపై ఈ కమిటీ కీలక సిఫార్సులు చేయనుంది. అదే సమయంలో, కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్రాంచైజీ లీగ్స్ కమిటీలో కూడా దేవజిత్ సైకియాకు సభ్యత్వం కల్పించింది. ప్రపంచవ్యాప్తంగా ఫ్రాంచైజీ క్రికెట్ లీగ్‌ల నిర్వహణ, నియంత్రణ, సమన్వయంపై ఈ కమిటీ పనిచేయనుంది. బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ ఈ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఇక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న క్రికెట్ వెస్టిండీస్ (సీడబ్ల్యూఐ)కు 12.82 మిలియన్ అమెరికన్ డాలర్ల రుణాన్ని మంజూరు చేయడానికి ఐసీసీ ఆమోదం తెలిపింది. ఈ నిధులతో వెస్టిండీస్ క్రికెట్ బోర్డు తన ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించే అవకాశం లభించనుంది. మరోవైపు, శ్రీలంక క్రికెట్ బోర్డు రాజ్యాంగ సవరణల పురోగతిని సమీక్షించిన ఐసీసీ, వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని సూచించింది.

# ప్రపంచకప్‌లకు కొత్త ఫార్మాట్

- సూపర్–7, సూపర్–10కు ఆమోదం
- 2027 వన్డే ప్రపంచకప్‌లో మూడు దశల పోటీ విధానం
- 2028 టీ20 ప్రపంచకప్‌లో సూపర్–8 స్థానంలో సూపర్–10
- పోటీతత్వం కోసం ఐసీసీ కీలక నిర్ణయం

**ఎడిన్‌బర్గ్:** 2027 వన్డే ప్రపంచకప్, 2028 టీ20 ప్రపంచకప్‌ల ఫార్మాట్‌లో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కీలక మార్పులు చేసింది. మరింత పోటీతత్వం, ప్రతి మ్యాచ్‌కు ప్రాధాన్యం పెంచే లక్ష్యంతో కొత్త విధానానికి ఆమోదం తెలిపింది. 2027లో దక్షిణాఫ్రికా వేదికగా జరిగే 14 జట్ల వన్డే ప్రపంచకప్‌లో మూడు దశల పోటీ విధానం అమలు చేయనున్నారు. 12 నుంచి 14వ స్థానంలో అర్హత సాధించిన జట్లు ముందుగా సూపర్ సిరీస్ ఆడతాయి. విజేత తదుపరి గ్రూప్ దశకు చేరుతుంది. రెండు గ్రూపుల నుంచి టాప్–3 జట్లు, అదనంగా ఒక జట్టు కలిసి సూపర్–7 దశకు అర్హత సాధిస్తాయి. అక్కడి నుంచి తొలి నాలుగు జట్లు సెమీఫైనల్స్‌కు చేరతాయి. 2028లో ఆస్ట్రేలియా–న్యూజిలాండ్ సంయుక్తంగా నిర్వహించే టీ20 ప్రపంచకప్‌లో సూపర్–8 స్థానంలో సూపర్–10 దశను ప్రవేశపెడుతున్నారు. 20 జట్లను ఐదు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూపు నుంచి తొలి రెండు జట్లు సూపర్–10కు చేరతాయి. అనంతరం గ్రూపు విజేతలు నేరుగా సెమీఫైనల్స్‌కు చేరుకోగా, రెండో స్థానంలో నిలిచిన జట్లు ఎలిమినేటర్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. కొత్త ఫార్మాట్‌తో టోర్నీ ఆరంభం నుంచి ఫైనల్ వరకు ప్రతి మ్యాచ్‌కు ప్రాధాన్యం పెరుగుతుందని, అభివృద్ధి చెందుతున్న క్రికెట్ దేశాలకు కూడా ప్రపంచ వేదికపై మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఐసీసీ పేర్కొంది. ఈ మార్పులకు ఐసీసీ బోర్డు ఆమోదం తెలిపినప్పటికీ, నవంబర్‌లో జరిగే సమావేశంలో ఆర్థిక, వాణిజ్య వ్యవహారాల కమిటీ సమీక్ష అనంతరం తుది ఆమోదం లభించనుంది.




# సిరీస్‌పై టీమిండియా కన్ను

- గెలుపే లక్ష్యంగా బరిలోకి ఇంగ్లండ్
- నేడు ఇరుజట్ల మధ్య రెండో వన్డే

**కార్డిఫ్:** ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్ గెలిచి 1–0 ఆధిక్యంలో ఉన్న భారత జట్టు.. బుధవారం జరిగే రెండో వన్డేలోనూ విజయం సాధించి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను కైవసం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఫిట్‌నెస్, సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ ఫామ్ జట్టు యాజమాన్యాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. తొలి వన్డేలో అర్ధశతకం దాటిన తర్వాత కండరాల అసౌకర్యంతో శుభ్‌మన్ గిల్ మైదానం వీడడం భారత శిబిరంలో ఆందోళన కలిగించింది. అయితే గాయం తీవ్రంగా లేదని, రెండో వన్డే నాటికి పూర్తిగా కోలుకుంటాడనే ఆశాభావంతో జట్టు యాజమాన్యం ఉంది. కెప్టెన్‌గా, ఓపెనర్‌గా గిల్ జట్టుకు కీలక ఆటగాడు కావడంతో ఆయన అందుబాటులో ఉండడం భారత్‌కు అత్యంత అవసరం.

## హిట్‌మ్యాన్ రాణించాలి

మరోవైపు కెప్టెన్సీ బాధ్యతలు కోల్పోయిన తర్వాత రోహిత్ శర్మ ఆశించిన స్థాయిలో బ్యాటింగ్ ప్రదర్శన చేయలేకపోతున్నాడు. తన అనుభవానికి తగిన భారీ ఇన్నింగ్స్‌తో విమర్శలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి మాత్రం ఇటీవల అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ భారత బ్యాటింగ్‌కు బలంగా నిలుస్తున్నాడు. బౌలింగ్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ తొలి మ్యాచ్‌లో ఆకట్టుకోవడం భారత్‌కు ధైర్యాన్నిస్తోంది. రెండో వన్డేలో బౌలింగ్‌కు మరింత పదును పెట్టేందుకు గర్నూర్ బ్రార్ స్థానంలో ఎడమచేతి పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం కల్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక హ్యారీ బ్రూక్ నాయకత్వంలోని ఇంగ్లండ్‌కు ఈ మ్యాచ్ డూ ఆర్ డైగా మారింది. ఈ పోరులో ఓడితే సిరీస్‌ను కోల్పోవాల్సి వస్తుంది. సొంతగడ్డపై, ముఖ్యంగా కార్డిఫ్ వేదికగా ఇంగ్లండ్‌కు మెరుగైన రికార్డు ఉండడం ఆ జట్టుకు కొంత ఊరటనిచ్చే అంశం. అయినప్పటికీ సిరీస్‌ను సమం చేయాలంటే అన్ని విభాగాల్లో మెరుగైన ప్రదర్శన చేయాల్సిన అవసరం ఉంది.




# టాప్ 10లో అక్షర్

- వన్డే ర్యాంకులు విడుదల చేసిన ఐసీసీ

**దుబాయ్:** ఇంగ్లండ్‌తో తొలి వన్డేలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెరిసిన భారత క్రికెటర్ అక్షర్ పటేల్ ఐసీసీ తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో ఆల్‌రౌండర్ల జాబితాలో టాప్–10లోకి ప్రవేశించాడు. మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 9వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. బర్మింగ్‌హామ్‌లో జరిగిన తొలి వన్డేలో అక్షర్ నాలుగు వికెట్లు తీయడంతో పాటు 52 బంతుల్లో 57 పరుగులు చేసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 18 స్థానాలు ఎగబాకి 73వ స్థానానికి, బౌలింగ్‌లో రెండు స్థానాలు మెరుగుపరుచుకుని 42వ స్థానానికి చేరుకున్నాడు. 75 బంతుల్లో 80 పరుగులతో రాణించిన శుభ్‌మన్ గిల్ 12 రేటింగ్ పాయింట్లు సాధించి, వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న డారిల్ మిచెల్‌కు కేవలం 11 పాయింట్ల దూరంలో నిలిచాడు. జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 24వ స్థానానికి చేరుకున్నాడు.







# ఎస్‌బీఐ ఫండ్స్ ఐపీఓకు భారీ స్పందన

- రెండో రోజే 2.77 రెట్లు సబ్‌స్క్రిప్షన్
- నాన్-ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల నుంచి డిమాండ్
- నేటితో ముగియనున్న ఐపీఓ

**న్యూఢిల్లీ:** దేశంలోని అతిపెద్ద అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ప్రారంభ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభించింది. రెండో రోజు ముగిసే సమయానికి ఈ ఐపీఓ 2.77 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. రూ.9,812.91 కోట్ల విలువైన ఈ ఐపీఓలో అందుబాటులో ఉన్న 12.45 కోట్ల షేర్లకు గాను 34.54 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి. నాన్–ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటా 6.58 రెట్లు, రిటైల్ కోటా 1.61 రెట్లు, అర్హత కలిగిన సంస్థాగత పెట్టుబడిదారుల (QIB) కోటా 1.50 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఐపీఓకు ముందు యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి కంపెనీ రూ.2,663 కోట్లు సమీకరించింది. ఈ ఇష్యూలో షేరు ధరను రూ.545–574 మధ్య నిర్ణయించగా, జూలై 16న బిడ్డింగ్ ముగియనుంది. ప్రస్తుతం ఎస్‌బీఐ, అముండి సంస్థలు తమ వాటాల్లో కొంత భాగాన్ని విక్రయిస్తున్నాయి. 1987లో స్థాపితమైన ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్.. రూ.12.51 లక్షల కోట్ల మ్యూచువల్ ఫండ్ ఆస్తులతో దేశంలోనే అతిపెద్ద అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీగా కొనసాగుతోంది.




పేటీఎం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్‌లో దేశీయ పెట్టుబడిదారుల వాటా మరింత పెరిగింది. 2026 జూన్ 30తో ముగిసిన త్రైమాసికానికి కంపెనీ షేర్‌హోల్డింగ్ వివరాల ప్రకారం, దేశీయ ఇన్వెస్టర్ల వాటా 51.6 శాతానికి చేరుకుంది. గత త్రైమాసికంలో ఇది 50.3 శాతంగా ఉండగా, వరుసగా రెండోసారి కంపెనీ మెజారిటీ భారతీయ యాజమాన్యాన్ని కొనసాగించింది. దేశీయ సంస్థాగత పెట్టుబడిదారుల వాటా కూడా 23.1 శాతం నుంచి 24.9 శాతానికి పెరిగింది. ముఖ్యంగా మ్యూచువల్ ఫండ్ల వాటా 16.6 శాతం నుంచి 17.9 శాతానికి చేరుకోగా, పేటీఎంలో పెట్టుబడులు పెట్టిన మ్యూచువల్ ఫండ్ల సంఖ్య 43కు పెరిగింది.



# బ్యాంకింగ్ షేర్ల జోరు.. పుంజుకున్న మార్కెట్లు

## 130 పాయింట్లు ఎగిసిన సెన్సెక్స్.. నిఫ్టీకి స్వల్ప లాభం

- అమెరికా వడ్డీ రేట్ల కోత ఆశలతో కొనుగోళ్లు
- మధ్యప్రాచ్య ఉద్రిక్తతలతో చివర్లో లాభాలు

**ముంబై:** బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు, అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాలకు తగ్గట్టుగా నమోదవడంతో వడ్డీ రేట్ల కోతపై ఆశలు పెరగడం భారత స్టాక్ మార్కెట్లకు ఊతమిచ్చాయి. దీంతో బుధవారం బీఎస్ఈ సెన్సెక్స్ 130.49 పాయింట్లు (0.17%) పెరిగి 77,185.43 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 26.45 పాయింట్లు (0.11%) లాభపడి 24,078.50 వద్ద ముగిశాయి. రోజంతా మార్కెట్లు లాభాల్లోనే ట్రేడైనప్పటికీ, అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో చివర్లో పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు.

## బలహీనంగా..

సెన్సెక్స్‌లో ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బజాజ్ ఫైనాన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడగా, పవర్‌గ్రిడ్, లార్సెన్ అండ్ టుబ్రో, టాటా స్టీల్, ఇన్ఫోసిస్ నష్టపోయాయి. సెక్టార్ల వారీగా క్యాపిటల్ గూడ్స్, పీఎస్‌యూ బ్యాంకులు, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు లాభపడగా, ఐటీ, మెటల్, ఎఫ్ఎంసీజీ, రియాల్టీ రంగాల షేర్లు బలహీనంగా ముగిశాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) మంగళవారం రూ.739.69 కోట్ల విలువైన షేర్లను విక్రయించినట్లు ఎక్స్ఛేంజ్ గణాంకాలు వెల్లడించాయి.

# కేరళలో టాటా తొలి షిప్‌బిల్డింగ్ యూనిట్

- నౌకల నిర్మాణం, మరమ్మతుల కేంద్రాల ఏర్పాటు
- సముద్ర రంగాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
- క్రూయిజ్ టెర్మినల్‌కు కొచ్చిన్ పోర్టుకు మద్దతు

**తిరువనంతపురం:** కేరళలో టాటా గ్రూప్ తన తొలి షిప్‌బిల్డింగ్ (నౌకల నిర్మాణ) ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వీడీ సతీశన్ ప్రకటించారు. రాష్ట్రంలో నౌకల నిర్మాణంతో పాటు షిప్ మెయింటెనెన్స్ (మరమ్మతుల) కేంద్రాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మారిటైమ్ మహోత్సవం–2026 కార్యక్రమంలో మాట్లాడిన సీఎం, సముద్ర రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ రంగానికి అవసరమైన బంకరింగ్ (ఇంధన సరఫరా) సదుపాయాల కల్పనపై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్‌తో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. అలాగే కొచ్చిన్ పోర్టులో క్రూయిజ్ టెర్మినల్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.





Business
బిజినెస్



# ఇన్‌స్టామార్ట్‌లో ఎల్‌పీజీ సిలిండర్ల డెలివరీ

- హెచ్‌పీసీఎల్‌తో స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ భాగస్వామ్యం
- బెంగళూరులో తొలుత సేవల ప్రారంభం
- 10 కిలోల హెచ్‌పీ నవ్య, 5 కిలోల సిలిండర్లు అందుబాటులోకి

**న్యూఢిల్లీ:** స్విగ్గీకి చెందిన క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టామార్ట్, 'హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)'తో భాగస్వామ్యం కుదుర్చుకుని ఎల్‌పీజీ సిలిండర్ల డెలివరీ సేవలను ప్రారంభించింది. ఈ సేవలు తొలుత బెంగళూరులో అందుబాటులోకి రానున్నాయి. ఈ భాగస్వామ్యంలో భాగంగా హెచ్‌పీసీఎల్ ఇటీవల విడుదల చేసిన 10 కిలోల హెచ్‌పీ నవ్య కాంపోజిట్ ఎల్‌పీజీ సిలిండర్‌తో పాటు 5 కిలోల మెటల్ సిలిండర్ కూడా ఇన్‌స్టామార్ట్‌లో లభించనున్నాయి. ఈ సిలిండర్లను కొనుగోలు చేయడానికి ముందుగా గృహ ఎల్‌పీజీ కనెక్షన్ ఉండాల్సిన అవసరం లేదని సంస్థ తెలిపింది. విద్యార్థులు, ఉద్యోగులు, చిన్న కుటుంబాలకు ఈ సేవలు మరింత ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొంది. వినియోగదారులు ఇన్‌స్టామార్ట్‌లో సిలిండర్‌ను ఆర్డర్ చేయవచ్చు. తొలి కొనుగోలు తర్వాత ఖాళీ సిలిండర్‌ను డెలివరీ సమయంలో తిరిగి ఇచ్చి రీఫిల్‌ను పొందే అవకాశం ఉంటుంది. హెచ్‌పీసీఎల్ అధీకృత డీలర్ల ద్వారా శిక్షణ పొందిన సిబ్బంది భద్రతా నిబంధనలను పాటిస్తూ సిలిండర్లను ఇంటికే అందజేస్తారు.

టాటా గ్రూప్‌కు చెందిన ఆర్థిక సేవల సంస్థ టాటా క్యాపిటల్ అంతర్జాతీయ బాండ్ మార్కెట్ ద్వారా 400 మిలియన్ అమెరికన్ డాలర్లు (సుమారు రూ.3,400 కోట్లకు పైగా) సమీకరించింది. 3.5 సంవత్సరాల కాలపరిమితి గల ఫిక్స్‌డ్ రేట్ సీనియర్ అన్‌సెక్యూర్డ్ రెగ్–ఎస్ బాండ్‌లు జారీ చేసి ఈ నిధులను సమీకరించినట్లు సంస్థ తెలిపింది. ఈ బాండ్‌లపై 5.332 శాతం స్థిర వడ్డీ రేటు నిర్ణయించగా, తుది ఆర్డర్ బుక్‌కు నాలుగు రెట్లు అధికంగా పెట్టుబడిదారుల నుంచి స్పందన లభించింది.








## 'మిస్టర్ మిడిల్‌క్లాస్' ఓ భావోద్వేగాల సినిమా

శ్రీకాంత్ కథానాయకుడిగా నటించిన 'మిస్టర్ మిడిల్‌క్లాస్' ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. జి. నాగేశ్వర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో లయ కథానాయికగా నటించగా, జీకే, సీఎన్ నిర్మించారు. విడుదలకు ముందుగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు దర్శకులు వి.వి. వినాయక్, దశరథ్, రచయిత కోన వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, "ఎంత ధనవంతులైనా జీవితంలో ఏదో ఒక దశలో మధ్యతరగతి జీవితాన్ని అనుభవించినవారే. ఆ జీవితం వెనకున్న కష్టాలను వినోదాత్మకంగా చూపించే ప్రయత్నమే ఈ సినిమా. ఇందులో వేంకటేశ్వర స్వామి పాత్ర చాలా కీలకం. ఆ పాత్రను రాజేంద్రప్రసాద్ అద్భుతంగా పోషించారు. ఈ సినిమా ప్రయాణం నా పాత రోజులను గుర్తు చేసింది" అన్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, "ఇలాంటి గొప్ప పాత్రలో నటించే అవకాశం రావడం నా అదృష్టం. శ్రీకాంత్‌తో 'క్షేమంగా వెళ్లి లాభంగా రండి' నుంచి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించాను" అని చెప్పారు. దర్శకుడు జి. నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "శ్రీకాంత్‌తో సినిమా చేయడం ఎప్పుడూ ఆనందంగా ఉంటుంది. ఈ చిత్రానికి రాజేంద్రప్రసాద్ వెన్నెముకలా నిలిచారు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నటులు అలీ, ధనరాజ్, పృథ్వీరాజ్, ఛాయాగ్రాహకుడు అంజి, సంగీత దర్శకుడు సాయికార్తీక్‌తో పాటు చిత్రబృంద సభ్యులు పాల్గొన్నారు.

## మహేష్ బాబు ఇంట పెళ్లి సందడి

సూపర్ స్టార్ మహేష్ బాబు కుటుంబంలో త్వరలో పెళ్లి వేడుకలు జరగనున్నాయి. మహేష్ బాబు సోదరి పద్మావతి, గల్లా జయదేవ్ దంపతుల చిన్న కుమారుడు సిద్ధార్థ్ గల్లా తన ప్రేయసి హాయిన్ కిమ్‌తో ఆదివారం కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఘనంగా నిశ్చితార్థం చేసుకున్నాడు. దక్షిణ కొరియాకు చెందిన హాయిన్ కిమ్‌తో కొంతకాలంగా ప్రేమలో ఉన్న సిద్ధార్థ్‌కు పెద్దల అంగీకారంతో ఈ నిశ్చితార్థం జరిగింది. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను మహేష్ బాబు సతీమణి నమ్రత శిరోద్కర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ కాబోయే వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. నిశ్చితార్థ వేడుకలో నమ్రతతో పాటు మహేష్ బాబు సోదరీమణులు, దివంగత రమేష్ బాబు కుమార్తె భారతి కూడా సందడి చేశారు. ముఖ్యంగా భారతి ఈ ఫొటోల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సందడితో జరిగిన ఈ వేడుక ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గల్లా జయదేవ్ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు అశోక్ గల్లా ఇప్పటికే హీరోగా గుర్తింపు పొందగా, ఆయన నటించిన **వీసా** చిత్రం త్వరలో విడుదల కానుంది. చిన్న కుమారుడు సిద్ధార్థ్ గల్లా మాత్రం సినీ రంగానికి దూరంగా కుటుంబ వ్యాపార బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వ్యాపార రంగంలో రాణిస్తున్న సిద్ధార్థ్, హాయిన్ కిమ్‌తో ప్రేమ బంధాన్ని ఇప్పుడు వివాహ బంధంగా మార్చుకోనుండటం విశేషంగా మారింది. ఇదిలా ఉండగా, మహేష్ బాబు ప్రస్తుతం దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్–వరల్డ్ చిత్ర షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తుండగా, వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది.



## 'రాఖా'లో ఫెమినా జార్జ్?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రాకా'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. సన్ పిక్చర్స్ సుమారు రూ.800 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఒక్కోసారి కొత్త నటీనటులు ఈ ప్రాజెక్ట్‌లో చేరుతున్నట్లు వార్తలు వస్తుండటంతో సినిమాపై మరింత ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో పలువురు హీరోయిన్లకు ప్రాధాన్యం ఉన్న పాత్రలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ పేర్లు వినిపించినప్పటికీ, అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే మలయాళ నటి ఫెమినా జార్జ్ ఇప్పటికే తాను 'రాకా'లో నటిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పుడు మరో నటి నైలా గ్రేవల్ కూడా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు స్వయంగా



వెల్లడించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, దర్శకుడు అట్లీతో కలిసి పనిచేయడం తన చిరకాల కల అని తెలిపింది. అట్లీ 18 ఏళ్ల కలల ప్రాజెక్ట్ అయిన 'రాకా'లో భాగమవడం నా అదృష్టం. ఇలాంటి భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో అవకాశం రావడం నా కెరీర్‌లో మైలురాయి. కేవలం హిందీ చిత్రాలకే పరిమితమైన నన్ను నమ్మి కీలక పాత్రకు ఎంపిక చేసిన అట్లీకి ప్రత్యేక కృతజ్ఞతలు, అని పేర్కొంది. హిందీలో 'తమాషా', 'బరేలీ కీ బర్ఫీ', 'తప్పడ్', 'ఇష్క్ విష్క్ రీబౌండ్' వంటి చిత్రాల్లో నటించిన నైలా గ్రేవల్, నెట్‌ఫ్లిక్స్ వెబ్ సిరీస్ 'మామ్లా లీగల్ హై'లో అడ్వకేట్ అనన్య శ్రాఫ్ పాత్రతో మంచి గుర్తింపు పొందింది. 'రాకా'తో ఆమె దక్షిణాది చిత్ర పరిశ్రమలోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వనుంది. ఇక ఈ భారీ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె కూడా కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఇప్పటికే సమాచారం వెలువడింది. వరుసగా క్రేజీ నటీనటులు ఈ ప్రాజెక్ట్‌లో చేరుతుండటంతో 'రాకా'పై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది.

## 'స్పిరిట్' టైటిల్‌కు కొత్త చిక్కులు

రెబల్ స్టార్ ప్రభాస్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'స్పిరిట్' మరోసారి టైటిల్ వివాదంలో చిక్కుకుంది. 'స్పిరిట్ ఈజ్ నాట్ వన్' పేరుతో రూపొందిన ఓ స్వతంత్ర తెలుగు చిత్ర నిర్మాతలు తమ సినిమా ఇప్పటికే సెన్సార్ ప్రక్రియ పూర్తి చేసుకుందని, 'స్పిరిట్' టైటిల్‌పై తమకే హక్కులు ఉన్నాయని పేర్కొంటున్నారు. ప్రభాస్ చిత్రబృందం ప్రతిపాదించిన కొన్ని షరతులు తమకు ఆమోదయోగ్యం కాకపోవడంతో ఫిలిం ఛాంబర్, సెన్సార్ బోర్డును ఆశ్రయించినట్లు వారు వెల్లడించారు. టైటిల్ వివాదం పూర్తిగా పరిష్కారమ య్యే వరకు ప్రభాస్ సినిమా పేరుకు ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని సంబంధిత అధికారులను కోరినట్లు తెలిపారు. అంతేకాకుండా వివాదం పరిష్కారం అయ్యే వరకు ప్రచార కార్యక్రమాల్లో 'స్పిరిట్' టైటిల్‌ను ఉపయోగించవద్దని కూడా డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణలపై ఇప్పటివరకు 'స్పిరిట్' చిత్ర నిర్మాతలు గానీ, టీ–సిరీస్ సంస్థ గానీ ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

## నాని నిర్మాణంలో నితిన్?





నేచురల్ స్టార్ నాని నటుడిగానే కాకుండా అభిరుచి గల నిర్మాతగానూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన నిర్మాణ సంస్థ నుంచి గతేడాది వచ్చిన **'కోర్ట్'** చిత్రం విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకుల ఆదరణను సొంతం చేసుకుంది. అయితే ఆ సినిమా తర్వాత కొత్త నిర్మాణాన్ని ప్రకటించని నాని, ఇప్పుడు మరో ఆసక్తికర ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. 'దండోరా' ఫేమ్ దర్శకుడు మురళీ కాంత్ దర్శకత్వంలో ఓ చిత్రాన్ని నిర్మించేందుకు నాని సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్‌లో హీరోగా నితిన్‌ను ఎంపిక చేయాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కథా చర్చలు కూడా జరిగినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. త్వరలోనే ఈ సినిమాపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉంటే, నితిన్ ప్రస్తుతం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న కొత్త చిత్రంలో నటిస్తున్నారు. ఆ సినిమా చిత్రీకరణ దశలో ఉండగా, తదుపరి ప్రాజెక్ట్‌గా నాని నిర్మాణంలో తెరకెక్కనున్న చిత్రానికి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇస్తారా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## బన్నీ-బాసిల్ కాంబోపై క్లారిటీ?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ వరుస ప్రతిష్ఠాత్మక చిత్రాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న 'రాకా' చిత్రంలో నటిస్తున్న బన్నీ, ఆ తర్వాత దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో మరో భారీ ప్రాజెక్ట్ చేయనున్నారు. ఈ రెండు చిత్రాల అనంతరం మలయాళ దర్శకుడు, నటుడు బాసిల్ జోసెఫ్‌తో అల్లు అర్జున్ సినిమా చేయనున్నారనే ప్రచారం కొంతకాలంగా సాగుతోంది. ఈ ఊహాగానాలకు తాజాగా బాసిల్ జోసెఫ్ సోషల్ మీడియా పోస్ట్‌తో మరింత బలం చేకూరింది. ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో 'ఐకాన్' అనే పదం ఉన్న క్యాప్ ఫొటోను పంచుకోవడంతో పాటు, అల్లు అర్జున్ నటించిన 'ఆర్య–2' చిత్రంలోని 'రింగా రింగా' పాటను బ్యాక్‌గ్రౌండ్‌లో జత చేశారు. దీంతో బన్నీ అభిమానులు ఈ కాంబినేషన్ దాదాపు ఖరారైనట్లేనని సోషల్ మీడియాలో చర్చించుకుంటున్నారు. 'మిన్నల్ మురళి'తో దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బాసిల్ జోసెఫ్‌తో అల్లు అర్జున్ భారీ స్థాయి సోషియో–ఫాంటసీ చిత్రాన్ని తెరకెక్కించే అవకాశమున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రాజెక్ట్‌పై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. త్వరలోనే ఈ క్రేజీ కాంబినేషన్‌పై స్పష్టత వచ్చే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## 'సంబరాల ఏటి గట్టు' చివరి షెడ్యూల్ షురూ

హీరో సాయిదుర్గా తేజ్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం సంబరాల ఏటి గట్టు చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. రోహిత్ కేపీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని కే నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయికగా నటిస్తోంది. తాజాగా ఈ సినిమా చివరి షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్లో సాయిదుర్గా తేజ్, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్‌లపై భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ చిత్రంలో సంజయ్ దత్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. 1940ల కాలం నేపథ్యంలో రూపొందుతున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో సాయిదుర్గా తేజ్ శక్తి వంతమైన యోధుడి పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే చిత్రీకరణ ముగింపు దశకు చేరుకున్న ఈ సినిమాను డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో జగపతిబాబు, శ్రీకాంత్, సాయికుమార్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తుండగా, వెట్రి పళనిసామి ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.



## ప్యారడాక్స్‌తో 'హన్సిక' రీఎంట్రీ!

అందాల తార హన్సిక మోత్వానీ మరోసారి కథానాయిక ప్రాధాన్య చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. 'ప్యారడాక్స్' పేరుతో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో ఆమె ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంతో ప్రముఖ కన్నడ కొరియోగ్రాఫర్ కెప్టెన్ కిశోర్ దర్శకుడిగా పరిచయం అవుతుండగా, కార్తిక్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను సోషల్ మీడియాలో విడుదల చేసింది. కన్నడలో పునీత్ రాజ్‌కుమార్‌తో నటించిన 'బిందాస్' తర్వాత హన్సిక నటిస్తున్న రెండో కన్నడ చిత్రం ఇదే కావడం విశేషం. సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఈ కథ ఓ శక్తిమంతమైన యువతి చుట్టూ తిరుగుతుందని చిత్రవర్గాలు వెల్లడించాయి. అవయవాల అక్రమ రవాణా నేపథ్యంలోని ఓ మిస్టరీని భావోద్వేగాలతో మేళవించి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని అందిస్తుందని పేర్కొన్నాయి. కథ, సాంకేతిక విలువలు, ఉత్కంఠభరితమైన కథనంతో అన్ని భాషల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది.

## రామ్ చరణ్ కొత్త ఫామ్‌హౌస్!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఇండియన్ సినీ పరిశ్రమలో అత్యంత సంపన్న నటుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. వివిధ నివేదికల ప్రకారం ఆయన నికర ఆస్తుల విలువ సుమారు రూ.1,370 కోట్లుగా అంచనా. నటుడిగానేకాకుండా కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ, బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు, స్టార్టప్‌లలో పెట్టుబడులు, హైదరాబాద్ పోలో అండ్ రైడింగ్ క్లబ్‌తో పాటు పలు వ్యాపారాల్లో వాటాల ద్వారా తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించారు. ఇప్పటికే హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో అత్యంత విలాసవంతమైన నివాసం కలిగిన రామ్ చరణ్.. ఇప్పుడు నగర శివార్లలో ప్రకృతి మధ్యలో మరో లగ్జరీ ఫామ్‌హౌస్‌ను నిర్మించుకు న్నారు. హైదరాబాద్‌కు సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న చేవెళ్ల – మొకిల ప్రాంతాల మధ్య ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఈ ఫామ్‌హౌస్‌ను నిర్మించారు. ఈ భూమిని రామ్ చరణ్, ఆయన సతీమణి ఉపాసన కొణిదెల కలిసి కొనుగోలు చేసినట్లు సమాచారం. కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా సమయం గడపడం, స్నేహితులతో ప్రత్యేక వేడుకలు నిర్వహించడం కోసం ఈ ఫామ్‌హౌస్‌ను అత్యంత ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. ప్రకృతికి దగ్గరగా ఉండే జీవనశైలిని ఇష్టపడే రామ్ చరణ్‌కు ఆర్గానిక్ వ్యవసాయంపై కూడా ఆసక్తి ఉండటంతో, భవిష్యత్తులో ఈ ఫామ్‌హౌస్‌లో సేంద్రీయ వ్యవసాయ కార్యకలాపాలు చేపట్టే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల ఈ ఫామ్‌హౌస్ నిర్మాణం పూర్తికాగా, త్వరలోనే గృహప్రవేశ వేడుక జరగనుంది. ఇంటి ఇంటీరియర్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దేందుకు ప్రముఖ ఇంటీరియర్ డిజైనర్లు ఆమిర్, హమీదా శర్మలను ఎంపిక చేసినట్లు సమాచారం. నిర్మాణం, ఇంటీరియర్ అలంకరణ కోసం భారీ మొత్తాన్ని వెచ్చించినట్లు తెలుస్తోంది. సినిమాలతో బిజీగా ఉండే రామ్ చరణ్.. తీరిక సమయాల్లో భార్య ఉపాసన, కుమార్తెతో కలిసి గడిపేందుకు ఈ లగ్జరీ ఫామ్‌హౌస్ ప్రధాన వేదికగా మారనుంది.

Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi.** **RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277